



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 268 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 19 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### 'నాన్ సీరియస్ ప్లేయర్స్'కు

# ఏపీలో చోటులేదు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేష్ స్పష్టీకరణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.


**ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట**

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన మిగతా .. 2లో..

### మూడు రోజుల్లో

# నీట్ పరీక్ష

## విద్యార్థులకు ఎన్‌టీఏ మెసేజ్




**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. "అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చు" అని ఎన్‌టీఏ సూచించింది. "పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగతా .. 2లో..

### ప్రపంచ రూపురేఖలను

## మార్చే స్థాయికి భారత్

ప్రధాని నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** పారిస్ అద్భుతమైన ఆలోచనలు, ఆవిష్కరణల నగరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రవాస భారతీయులు ఈ నగరానికి కొత్త కాంతులు తెచ్చారని, భారత్ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా నిలుస్తున్నారన్నారు. జీ7 సదస్సులో పాల్గొన్న అనంతరం పారిస్‌కు వెళ్లిన ఆయన.. అక్కడి ప్రవాస మిగతా .. 2లో..

### స్టాక్ మార్కెట్లు

## దూసుకుపోతున్నాయి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ ఒప్పందంపై సంతకాలు పూరయిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా స్పందించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండదని మరోసారి స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తున్నాయని, చమురు ధరలు తగ్గుతున్నాయని అన్నారు. ఈ మేరకు తన మిగతా .. 2లో..

### కుల రాజకీయాలకు కేరాఫ్

## వైఎస్ కుటుంబం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కుల రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబమని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు, రాజమహేంద్రవరం గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విమర్శించారు. కూటమి సర్కారు రెండేళ్ల పాలనపై గురువారం రాజమహేంద్రవరం గ్రామీణం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గతంలో మిగతా .. 2లో..

### కారుమూరి సునీల్‌కు


## 14 రోజుల రిమాండ్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణంలో అరెస్టయిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది. 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం సునీల్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అంతకుముందు కోర్టులో ఈడీ, సునీల్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు మిగతా .. 2లో..

### సీఎం చంద్రబాబు చొరవ..


## ఆక్వా ఫీడ్ ధర తగ్గింపునకు తయారీదారుల అంగీకారం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆక్వా రైతుల సమస్యకు సీఎం చంద్రబాబు పరిష్కారం చూపారు. సీఎం నిర్దేశించడంతో ఆక్వా ఫీడ్ ధర కిలోకి రూ.4 తగ్గించేందుకు తయారీదారులు అంగీకారం తెలిపారు. దీంతో ప్రస్తుతమున్న ఫీడ్ ధరలు రూ.112 నుంచి రూ.108కి తగ్గనున్నాయి. సీఎంతో సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులు, ఫీడ్ తయారీదారులు పాల్గొన్నారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులతో కమిటీ వేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఫీడ్ ధర విషయంలో సీఎం చొరవపై చేపలు, రొయ్యల సాగు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత మిగతా .. 2లో..

## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ

మంత్రి లోకేశ్ సమక్షంలో ఎంవోయూ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరుకు చెందిన జేఎస్ఎస్ (జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర మహావిద్యాపీఠం) ఆధ్వర్యంలో తిరుపతిలో జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ఉన్నత విద్యామండలి-జేఎస్ఎస్ మహావిద్యాపీఠం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్సలర్ డా.బి.సురేశ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మైసూరులోని జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ నాక్ నుంచి A++ గుర్తింపుతో డీమ్డ్ విశ్వవిద్యాలయంగా కొనసాగుతోంది. ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానం, మిగతా .. 2లో..

## 2029 ఎన్నికల విజయమే మన లక్ష్యం

అమెరికాలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో పర్యటిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్, 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. వర్జీనియాలో ప్రవాస తెలుగువారితో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాశ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల విజయం ప్రజాస్వామ్యాన్ని కాపాడిన ప్రతి తెలుగువాడిదని అన్నారు. ఈ గెలుపులో ప్రవాసుల పాత్రను చంద్రబాబు ఎప్పుడూ ప్రశంసిస్తారని గుర్తుచేశారు. లోకేశ్ చొరవతో విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలకు ఇటీవలి పదో తరగతి ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు ఆశయాలకు అనుగుణంగా నగరి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన మాట్లాడుతూ దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు రాజకీయ జీవితం ఎందరికో మిగతా .. 2లో..

### ఎవరు అడ్డుపడినా

## ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్ ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. హైదరాబాద్‌లోని గుర్రంగూడలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మొక్క నాటారు. అర్బన్ ఎకో పార్కు నమూనాను అటవీ శాఖ అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని మిగతా .. 2లో..

### సాయికృష్ణని చంపేసి.. సాక్ష్యాలు దొరకకుండా

## అస్థికలను కృష్ణానదిలో కలిపేశారు

మాజీ ఎంపీ కేశినేని నాని




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ రౌడీ షీటర్ గాదె సాయికృష్ణ మిస్సింగ్ వివాదం.. ఇప్పుడు 'లాకప్ డెత్' ఆరోపణలతో జాతీయ స్థాయికి చేరింది. ఈ ఉదంతంపై మాజీ ఎంపీ కేశినేని నాని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసుల థర్డ్ డిగ్రీ దెబ్బల వల్ల సాయికృష్ణ ఒంటిపై పడ్డ గాయాలు ఎక్కడ బయటపడతాయో అనే భయంతోనే.. పోలీసులు అతడి మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా అత్యంత రహస్యంగా దహనం చేశారని కేశినేని నాని తన ఫిర్యాదులో ఆరోపించారు. అంతే కాకుండా, భవిష్యత్తులో ఫోరెన్సిక్ పరీక్షలు లేదా డీఎన్ఏ సాక్ష్యాలు కూడా దొరకకుండా ఉండేందుకు.. పక్కా ప్లాన్ ప్రకారం సాయికృష్ణ అస్థికలను కృష్ణానదిలో కలిపేశారంటూ సంచలన విషయాలను మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలో పోలీసులు మిగతా .. 2లో..

### ప్రతి నియోజకవర్గంలో

## 25 నుంచి 30 ఆలయాల నిర్మాణానికి శ్రీకారం

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలోని ప్రతి నియోజకవర్గంలో 25 నుంచి 30 ఆలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, ఆ మేరకు తాము చర్యలు తీసుకుంటున్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం ట్రస్టు ద్వారా 1028 చోట్ల రూ.200 కోట్ల వ్యయంతో ఆలయాల నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మిగతా .. 2లో..

## లగేజీ మాటున 374 గ్రాముల బంగారం



**శంషాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కౌలాలంపూర్ నుంచి అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 10న శంషాబాద్ విమానాశ్రయంలో ఘటన చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ వ్యాపారి వ్యక్తిగత పనుల కోసం మలేసియాకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో 374 గ్రాముల బంగారాన్ని లగేజీలో పెట్టుకుని ఎయిర్ ఆసియా ఎయిర్‌లైన్స్ ఏకే-69 విమానంలో ఎక్కి శంషాబాద్‌లో దిగాడు. ఆయన ప్రవర్తనపై అనుమానం రావడంతో భద్రతాధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. లగేజీలో దొరికిన సుమారు రూ.55 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**రూ.2.49 కోట్ల విలువైన గంజాయితో మరొకరు..**

విదేశాల నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో హైడ్రోఫోనిక్ గంజాయి పట్టుబడింది. నగరానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకాక్ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు

దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లీథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

**ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్**

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆక్వా ఫీడ్ ధర తగ్గింపునకు తయారీదారుల అంగీకారం

సీఎందేనని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని.. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఆక్వా రైతులు విమర్శించారు.

**పొగాకు రకం ఏదైనా రూ.200కి తగ్గకూడదు: సీఎం**

పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడాలని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ.200కి తగ్గడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో చంద్రబాబు సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సీఎం అన్నారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్‌కు వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు.

## ప్రపంచ రూపురేఖలను మార్చే స్థాయికి భారత్

భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. 'చాయ్‌వాలాను భారతదేశం ప్రధానిని చేసింది. 12 ఏళ్లపాటు దేశానికి సేవలందించడం గౌరవంగా భావిస్తున్నా. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చాం. భారత్‌లోని గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. చంద్రయాన్ విజయవంతానికి ప్రపంచం సాక్షిగా నిలిచింది. ప్రపంచ రూపురేఖలను మార్చే స్థాయికి భారత్ ఎదిగింది. భారత్ - ఫ్రాన్స్ మధ్య వాణిజ్యం మరింత పుంజుకుంది. భారత్ - ఫ్రాన్స్ బంధాలు స్థిరత్వానికి ప్రతీక. 12 ఏళ్లలో భారత్ జీడీపీ, విమానాశ్రయాలు, జాతీయ రహదారుల నిర్మాణం రెట్టింపయ్యాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## స్టాక్ మార్కెట్లు దూసుకుపోతున్నాయి

'ట్రూత్ సోషల్'లో పోస్టులు పెట్టారు. "చమురు ప్రవహిస్తోంది, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండదు, ప్రపంచం సురక్షితంగా ఉంటుంది. స్టాక్ మార్కెట్లు దూసుకుపోతున్నాయి, ఉపాధి అవకాశాలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. ధరలు తగ్గుతున్నాయి. మన దేశం మునుపటి కంటే బలంగా, సురక్షితంగా ఉంది" అని ట్రంప్ పోస్టు చేశారు. దీనికి కొన్ని గంటల ముందు సామాజిక మాధ్యమంలో ఇవే అంశాలను ప్రస్తావిస్తూ.. ఇరాన్ విషయంలో తాను కఠినంగా వ్యవహరించలేదని భావించే వాళ్లు స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిని తాకుతుండటాన్ని గమనించాలన్నారు.

## కుల రాజకీయాలకు కేరాఫ్ వైఎస్ కుటుంబం

వంగవీటి మోహన్ రంగా, దేవినేని నెహ్రూ మధ్య వివాదాలకు రాజశేఖర్‌రెడ్డి కులం రంగు పులిమి రాష్ట్రవ్యాప్తంగా ఆ రెండు కులాల మధ్య వైరం తీసుకొచ్చారన్నారు. తండ్రి బాటలోనే నడుస్తున్న జగన్ సైతం కులాలు, మతాల పేరిట విభజించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కాపు రిజర్వేషన్ల కోసం మాట్లాడుతున్న ముద్రగడ వైకాపా పాలనలో ఏం చేశారని ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికగా వైకాపా రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టిస్తోందన్నారు. జగన్ హయాంలో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. రెండేళ్ల కూటమి హయాంలో రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. త్వరలో పరిశ్రమలు పూర్తికానున్నాయని చెప్పారు.

## కారుమూరి సునీల్‌కు 14 రోజుల రిమాండ్

వినిపించారు. ఈడీ తరఫున పీపీ వాదించారు. వైకాపా ప్రభుత్వంలో సునీల్ తండ్రి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారని పీపీ కోర్టుకు తెలిపారు. తండ్రి పలుకుబడితో సునీల్ మద్యం రవాణా కాంట్రాక్టులు దక్కించుకుని భారీగా లబ్ధి పొందినట్లు ఆధారాలను ఈడీ సేకరించిందన్నారు. కుటుంబసభ్యుల మధ్య రూ.7 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఈడీ గుర్తించిందని చెప్పారు. సుదర్శన కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సందీప్, ప్రతాప్‌రెడ్డికి మద్యం రవాణా కాంట్రాక్ట్‌లు వచ్చాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కాంట్రాక్టులు ఇప్పించినందుకు సుదర్శన కన్‌స్ట్రక్షన్ నుంచి రూ.28 కోట్ల మేర సునీల్‌కు ముడుపులు అందాయని పీపీ తెలిపారు. కేసులో లోతైన దర్యాప్తు జరుగుతోందని.. సరైన సమయంలో ఆధారాలను సమర్పిస్తామన్నారు. మద్యం రవాణా కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. వాదనల అనంతరం సునీల్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## మూడు రోజుల్లో నీట్ పరీక్ష

మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం" అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ

ఓవరాల్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 38వ స్థానాన్ని దక్కించుకుంది. 70 ఏళ్ల చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు ఇది ప్రధాన విద్యాసంస్థగా ఉండగా.. భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌లో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ కోర్సులు ఏర్పాటుచేయనున్నారు. ఈ క్యాంపస్‌లో మొత్తం 74 కోర్సులు అందుబాటులో ఉండనుండగా.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత 10 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంది. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకుపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, పరిశోధకులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ సంస్థ తోడ్పాటును అందించనుంది.

## 2029 ఎన్నికల విజయమే మన లక్ష్యం

ఆదర్శమన్నారు. ఆ వారసత్వాన్ని భానుప్రకాష్ కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమ సమన్వయకర్తలు మాగులూరి భానుప్రకాశ్, యష్ బొద్దులూరి, సుధీర్ కొమ్మి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మాగులూరి భానుప్రకాశ్ అధ్యక్షత వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సమావేశంలో సాయిశ్రీనివాసరెడ్డి భూమిరెడ్డి, సత్యనారాయణరాజు, మాధవనాయుడు బోయెల్ల సహా పలువురు ప్రవాస తెలుగువారు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం

ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం" అని అన్నారు.

## అస్థికలను కృష్ణానదిలో కలిపేశారు

'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే పదాన్ని పూర్తిగా మరిచిపోయారని... శాంతిభద్రతలను కాపాడాల్సింది పోయి మాఫియాలకు కొమ్ముకాస్తూ ప్రైవేట్ సెటిల్‌మెంట్ల సిండికేట్‌గా మారిపోయారని మండిపడ్డారు. ఈ లాకప్ డెత్ వ్యవహారంలో కేశినేని నాని రెండు ప్రధాన లీగల్ డిమాండ్లను ఎన్ హెచ్‌ఆర్ సీ ముందు ఉంచారు. శాఖాపరమైన పూర్తి బాధ్యత కింద విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు, సాయికృష్ణ అక్రమ నిర్బంధం, పోలీసుల చేతిలో జరిగిన హత్యపై సెక్షన్ 176(1ఏ) కింద తక్షణమే ఒక స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరారు.

## 25 నుంచి 30 ఆలయాల నిర్మాణానికి శ్రీకారం

రెండేళ్ల పాలనపై విజయోత్సవ సభను గురువారం ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలో ఐదు వేల ఆలయాల నిర్మాణం ఈ మూడేళ్లలో చేపడతామన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పరిధిలో ప్రతిపాదనలు పంపించాలన్నారు. పది సెంట్లలోపు స్థలం ఉంటే రూ.20 లక్షలు, 15 సెంట్లు అయితే రూ.30 లక్షలు, 20 సెంట్లు ఉంటే రూ.40 లక్షలు ఆలయ నిర్మాణానికి మంజూరు చేస్తామన్నారు. రామాలయమా.. శివాలయమా.. అమ్మవారి దేవాలయమా.. అనేది స్థానికుల నిర్ణయం మేరకు ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకొని ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో గుర్తించాలన్నారు.

## లగేజీ మాటున 374 గ్రాముల బంగారం

వెళ్లాడు. వియత్నాం మీదుగా స్వదేశానికి వస్తున్న క్రమంలో 7.118 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని సామగ్రిలో పెట్టుకున్నాడు. క్యాథే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ సీఎక్స్-673 విమాన సర్వీస్‌లో ఎక్కి శంషాబాద్‌లో దిగాడు. అతని ప్రవర్తనపై భద్రతాధికారులకు అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. లగేజీలో పట్టుబడిన రూ.2.49 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో

## ఆయన చొరవ, సేవా దృక్పథం అభినందనీయం

### మంత్రి సుభాష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కుడుపూడి సత్తిబాబు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు మరియు బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామచంద్రపురంలోని అడపా భాస్కర రామమూర్తి కళ్యాణవేదిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌కు పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. కార్మికుల సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, సేవా దృక్పథం అభినందనీయమని సత్తిబాబు పేర్కొన్నారు. రాజకీయంగా మంత్రి సుభాష్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని, ఆయురారో గ్యాలతో సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని మంత్రి సుభాష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్టులు విద్యార్థులకు పంపిణీ



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్టులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఆర్.ఐ.ఓ. ఐ.శారద పర్యవేక్షణలో 2026 - 2027 విద్యా సంవత్సరంకు సంబంధించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్టులను మొదటి మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఏ.వెంకట రమణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏ.వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులు అంతా క్రమశిక్షణ కలిగి ఉండాలని బాగా చదివి మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.వెంకట్రావు అధ్యాపకులు ఎస్కే అలీముద్దీన్, వి.ఎస్.శేఖర్ బాబు, కె.పెద్దబ్బులు, వై.శివకుమారి, సి.శాంతి సుధ, కె.ఉమాశంకర్, పి.రామాంజనేయ రావు, డి.భాస్కరరావు, పి.సూర్య, బి.ఏసురత్నం, జె.గంగాధరరావు, కె.రాజ్యలక్ష్మి, వై.రాజేష్ బాబు, టి.సుహాసిని,అక్షయ జ్యోతి, ఎన్.కళ్యాణి దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## టెలిగ్రామ్ కొత్త డార్క్ వెబ్.. నేరగాళ్లకు అడ్డా

### కేంద్రం సంచలన ఆరోపణలు




**విశ్వం వాయిస్ న్యూస్ :** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సదరు మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది.

**గోప్యత ఫీచర్లతో..**

"ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేకపోతున్నారు" అని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది.

**హ్యాకింగ్.. పైరసీ..**

ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

# ఎడిటర్ వాయిస్

## జగన్ ఆరాటం.. నాయకుల పోరాటం?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ అయితే తెగ ఆరాటపడుతున్నారు. ఆయన గత కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు సర్ ప్రక్రియ విషయంలో జాగ్రత్తగా ఉండాలని. సర్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగిస్తారు అని అంటున్నారు. నియోజకవర్గానికి అయిదు వేల ఓట్లు అలాగే బూత్ లెవెల్ లో యాభై ఓట్లు వైసీపీని టార్గెట్ చేసుకున్నారు అని కూడా ఆయన అంటున్నారు. ఈ విషయంలో అధికారంలో కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి పూర్తి అప్రమత్తంగా ఉండాలని జగన్ కోరుతున్నారు.

మీదే బాధ్యత అంటూ : ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్లు తమ బాధ్యతగా సర్ ప్రక్రియని మోనిటరింగ్ చేయాలని జగన్ కోరుతున్నారు. లేకపోతే తీవ్ర స్థాయిలో నష్టపోతామని కూడా జగన్ స్పష్టంగా చెబుతున్నారు. తాజాగా జగన్ మరో మారు ఇదే తరహా హెచ్చరికలను పార్టీ నేతలకు జారీ చేశారు. ఒక్క ఓటు సర్ ప్రక్రియలో తొలగించినా తిరిగి ఆ ఓటుని చేర్చడం బహు కష్టమని సీనియర్ నాయకుల భేటీలో జగన్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియని అంతా అర్ధం చేసుకోవాలని జగన్ సూచించారు.

నాలుగు వారాలు కీలకం : ఏపీలో సర్ ప్రక్రియ మొదలైపోయింది. జూన్ 15 నుంచి జూలై 15 వరకూ నెల రోజుల పాటు సర్ ప్రక్రియ సాగుతుంది. ఆ తరువాత ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. అయితే ముసాయిదాలో తప్పు ఒప్పులు చూసుకుని పోయిన ఓట్లను చేర్పించడం కష్టమవుతుందని అంటున్నారు. అది ఒక పెద్ద ప్రహ్సనం. అంతే కాదు అతి పెద్ద తతంగంగా ఉంటుందని అంటున్నారు. అందువల్ల ఈ నాలుగు వారాలే కీలకమని జగన్ పదే పదే చెబుతున్నారు. ప్రతీ ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్ కూడా కష్టపడాలని వారి వెంట నియోజకవర్గం ఇంచార్జి తప్పనిసరిగా ఉండాలని కూడా జగన్ సూచిస్తున్నారు.

బాబుతో జాగ్రత్త : ఇక ఏపీలో చంద్రబాబుతో జాగ్రత్త అని కూడా జగన్ అంటున్నారు. బాబు వ్యూహాలలో ఆరితేరిన వారు అని అందువల్ల వైసీపీ ఓట్లు గల్లంతు కాకుండా కంటికి రెప్పలా కాచుకోవాల్సిన అవసరం ఉందని జగన్ అంటున్నారు. ఇక వైసీపీ ఓట్లను పెద్ద ఎత్తున తీసేయడానికి కూటమి కుట్ర చేస్తోంది అని కూడా జగన్ ఆరోపిస్తున్నారు. గ్రౌండ్ లెవెల్ లోకి వైసీపీ యంత్రాంగం మొత్తం దిగితేనే తప్ప సర్ లో వైసీపీ ఓట్ల గల్లంతుని అడ్డుకోలేమని జగన్ గట్టిగా చెబుతున్నారు. నిరంతరం సమీక్షలు కూడా చేయాలని జగన్ కోరుతున్నారు.

సీరియస్ గానేనా : అయితే జగన్ ఆరాటం చాలానే ఉంది కానీ నాయకుల పోరాటం ఆ లెవెల్ లో ఉందా అన్న చర్చ సాగుతోంది. వైసీపీ ఓట్లను రక్షించుకోవాలని జగన్ ఎంత చెబుతున్నా గ్రౌండ్ లెవెల్ కి వచ్చేసరికి ఆ సీరియస్ నెస్ ఎంత అన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది. పార్టీలో ఇంకా యాక్టివ్ నెస్ రాకపోవడం ఒక కారణం అయితే ఇంత చేసినా రేపటి ఎన్నికల్లో తమకు టికెట్ దక్కుతుందా లేదా అన్న డౌట్ కూడా నేతలకు ఉందని అంటున్నారు. మరో వైపు క్యాడర్ లో ఇంకా నిరాశ పోలేదని అంటున్నారు. ఈ రెండేళ్లలో క్యాడర్ ని దగ్గర తీసి కనీసం సమీక్షలు అయినా నిర్వహించకపోవడం వల్లనే ఆ ప్రభావం ఇపుడు పడుతోందా అన్న చర్చ సాగుతోంది. మొత్తానికి చూస్తే అవతల టీడీపీ పూర్తి జోష్ లో ఉంది. ప్రతీ ఓటూ మనదే కావాలని పట్టుదలగా ఉంది. వైసీపీ కూడా పందెం కోడిలా తలపడినపుడే సర్ ప్రక్రియలో ఓట్లు గల్లంతు కావు. మరి రెండు రోజులుగా సర్ సాగుతోంది. వైసీపీ హడావుడి అయితే ఇంకా మొదలు కాలేదనే అంటున్నారు. చూడాలి మరి పార్టీ నేతలు ఏ రకంగా రంగంలోకి దిగుతారో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఒడిశాలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గంజాయి సరఫరా చేస్తున్న ముఠాలపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. దాదాపు 500 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలో దొరికిన ముఠాల లింక్ ఆధారంగా ఒడిశా వెళ్లిన ఈగల్ ఫోర్స్ టీమ్.. బలిమెల నుంచి జయపూర్ వరకు 80 కిలోమీటర్లు వెంబడించి గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుంది. పోలీసులు వెంబడించడంతో బొలెరో డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. వాహనంలో వివిధ ప్యాకెట్లుగా ఉన్న 500 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం ఒడిశాలోని గాంధీనగర్ వాసి అమీర్ అలీఖాన్ పేరుతో ఉన్నట్టు గుర్తించారు.

## విశాఖ గాజువాకలో భారీ అగ్నిప్రమాదం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రద్దీగా ఉండే కొత్త గాజువాక మార్కెట్ రోడ్డులోని శివ ఫైర్‌వర్క్స్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణం నుంచి భారీగా మంటలు ఎగసి పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అగ్నిప్రమాదఘటనతో మార్కెట్ రోడ్డులో ట్రాఫ్ జామ్ అయింది. శివ ఫైర్‌వర్క్స్‌కు పోలీసుల నుంచి అనుమతి లేదని విశాఖ సౌత్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. దీంతో దుకాణ యజమాని కోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నట్టు చెప్పారు. జనావాసాలు, వ్యాపారకూడలి వద్ద పేలుడు పదార్థాలు విక్రయించకూడదని, షాపు యజమానిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కర్నూలులో రెచ్చిపోయిన వైకాపా అల్లరి మూక..

### తెదేపా కార్యకర్తపై హత్యాయత్నం



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో అర్ధరాత్రి వైకాపా అల్లరి మూకలు రెచ్చిపోయాయి. తెదేపా కార్యకర్త తైజుమ్ బాషాపై విచక్షణారహితంగా కర్రలు, రాళ్లతో దాడి చేసి హత్యాయత్నం చేశారు. బాషా తన ఇంటి నుంచి కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా మాటు వేసిన వైకాపా కార్యకర్తలు.. అతనిపై తీవ్రస్థాయిలో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న బాషాను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడిలో వైకాపా కార్యర్తలు జలీలు, ఫైజల్, ఆరిఫ్‌తో పాటు మరికొందరు పాల్గొన్నారని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓట్ల సవరణ కార్యక్రమంలో వైకాపా తప్పులు కనిపెడుతున్నారని, తెదేపాలో యాక్టివ్‌గా ఉన్నాడనే కారణంతో బాషాపై నిందితులు దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## అనకాపల్లి పోలీసులకు చిక్కిన అంతర్జాతీయ స్మగ్లర్

### గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులు



**అనకాపల్లి పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా పోలీసులకు అంతర్జాతీయ స్మగ్లర్ చిక్కాడు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు ఎస్పీ తుహిన్‌సిన్హా వెల్లడించారు. పరవాడ మండలం లంకెలపాలెం వద్ద పోలీసులు వాహనతనిఖీలు చేస్తుండగా కారులో 213.390 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను విచారించగా వీరిలో అంతర్జాతీయ స్మగ్లర్ షేక్ అజ్మల్‌ఖాన్ ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడులోని రామనాథపురం జిల్లాకు చెందిన ఖాన్ నర్సీపట్నంలో నివాసం ఉంటున్నాడు. 2022లో శ్రీలంకలో డ్రగ్స్ సరఫరా చేస్తూ అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనికి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాతో సంబంధం ఉంది. శ్రీలంకలో 2022 నుంచి 2025 వరకు జైలుశిక్ష అనుభవించాడు. బెయిల్ రావడంతో అతడి పాస్‌పోర్టు ఆ దేశ పోలీసుల వద్దనే ఉంది. అజ్మల్‌ఖాన్ సముద్రమార్గంలో అక్రమంగా భారత్‌లోకి 2026 జనవరిలో ప్రవేశించాడు. మధ్యలో ఒకసారి శ్రీలంకకు వెళ్లి తిరిగి దొంగచాటుగా భారత్ వచ్చినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. ఇక్కడికి వచ్చాక తమిళనాడుకు చెందిన రాజా అనే గంజాయి వ్యాపారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం నుంచి గంజాయిని విజయవాడ, చెన్నైకి తరలించేలా సన్నాహాలు చేశారు. పెదబయలు మండలం గోమంగి గ్రామానికి చెందిన శెట్టి రవికుమార్ నుంచి రూ.6 లక్షలకు సరకు కొనుగోలు చేయడానికి యత్నించారు. సరకు రావడం ఆలస్యం కావడంతో ఒడిశా రాష్ట్రం జనబ ప్రాంతానికి చెందిన శ్యామ్ నుంచి సేకరించారు. దీనిని కారులో తరలిస్తుండగా ఈ నెల 16న పరవాడ మహిళా ఎస్సై జి.ఎస్.వి.మహాలక్ష్మి నేతృత్వంలో ప్రత్యేక బృందం పట్టుకున్నారు. నిందితులు అజ్మల్‌ఖాన్, ఇతని సోదరుడు అబ్దుల్ రహమాన్, శెట్టి రవికుమార్, తోలం దుర్గాప్రసాద్, కొర్లేజి లోవప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన శ్యామ్, చెన్నైకు చెందిన రాజా పరారీలో ఉన్నారు. 213.390 కేజీల గంజాయితోపాటు రూ.95,240, కారు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో పరవాడ డీఎస్పీ బి.మోహనరావు, సీఐ ఆర్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## అప్పర్ ప్రైమరీ పేరుతో హైస్కూల్ దందా..!

### ఆలమూరు మండలం చెముడులంక నేతాజీ స్కూల్‌కు షోకాజ్ నోటీస్

### అనుమతి లేకుండా 8,9,10 తరగతుల నిర్వహణ

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలంలోని మూలస్థాన అగ్రహారంలోని శ్రీ సాయి చైతన్య ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలకు నర్సరీ నుంచి 5వ తరగతి వరకు , మడికిలోని శ్రీ సాయిరాం విద్యానికేతన్ అప్పర్ ప్రైమరీ స్కూల్, చొప్పెల్లలోని ఎస్.ఎస్. అప్పర్ ప్రైమరీ స్కూల్, అంమవారులోని శ్రీ వేద గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్.... పెద్దపట్లలోని శ్రీ లక్ష్మి అప్పర్ ప్రైమరీ స్కూల్, పినపల్లలోని సాయి అప్పర్ ప్రైమరీ స్కూల్ (ఎం), జొన్నాడలోని శ్రీ చైతన్య అప్పర్ ప్రైమరీ స్కూల్, శ్రీ సత్యం అప్పర్ ప్రైమరీ స్కూల్, కొత్తూరులోని బ్లూ బెల్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (ఇఎం), పెనికేరులోని జైశంకర అప్పర్ ప్రైమరీ స్కూల్, చెముడులంకలోని నేతాజీ అప్పర్ ప్రైమర్ స్కూల్ (ఇఎం)లకు ప్రభుత్వ గుర్తింపు 7వ తరగతి వరకు మాత్రమే ఉన్నట్లు వెల్లడించిన విద్యాశాఖ.

### కోనసీమ జిల్లాలో దారుణం..

## యజమానిని చంపిన కూలీలు



**ఐ.పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కొత్తమురుముళ్లలో దారుణం చోటు చేసుకుంది. ఆక్వా రైతు దాట్ల రామకృష్ణరాజు (68)ను ఆయన చెరువు వద్ద పనిచేసే కూలీలు బండ రాయితో మోది హత్య చేశారు. అదే రాయిని అతని నడుముకు కట్టి చెరువులో పడేశారు. ఒడిశా ప్రాంతానికి చెందిన నలుగురు కూలీలు చెరువు వద్ద నివాసం ఉంటూ కాపలా కాస్తున్నారు. చెరువు పనుల విషయంలో రైతుకు, కూలీలకు మధ్య ఘర్షణ జరిగింది. గంజాయి మత్తులో ఉన్న కూలీలు ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. కూలీలు అక్కడి నుంచి పారిపోతుండగా కాకినాడ సమీపంలో అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీంద్రబాబు తెలిపారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

### కారును ఢీకొన్న లారీ: ముగ్గురి మృతి

మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి–మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు.

# బంగారం కొంటున్నారా? చాలామంది చేసే పొరపాట్లు మీరు చేయకండి..!

బంగారం కొనుగోలు చేయడం అంటే అది మన భవిష్యత్తు కోసం చేసే ఒక ముఖ్యమైన పెట్టుబడి. అయితే సరైన అవగాహన లేకుండా బంగారు నగలు కొంటే నష్టపోవాల్సి ఉంటుంది. హాల్‌మార్క్, బిల్లు, మేకింగ్ ఛార్జీలు, రాళ్ల విలువ వంటి అంశాలను ముందుగానే పరిశీలించి కొనుగోలు చేస్తే భవిష్యత్తులో నష్టాలను నివారించవచ్చు. బంగారం కొనేటప్పుడు తప్పక తీసుకోవాల్సిన కీలక జాగ్రత్తలు తెలుసుకోండి. బంగారం కొనుగోలు చేయడం ఒక ముఖ్యమైన పెట్టుబడిగా చాలా మంది పరిగణిస్తారు. అందుకే బంగారం కొంత మేర తగ్గినప్పుడు అందులో పెట్టుబడి పెడుతుంటారు. అయితే బంగారు నగలు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో నష్టాలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బంగారం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ కొన్ని ముఖ్యమైన అంశాలు విషయంలో జాగ్రత్త పాటించాలి. చాలా మంది సరైన అవగాహన లేకుండా బంగారు కొనుగోలు సమయంలో చేసే చిన్నచిన్న పొరబాట్లతో నష్టపోతుంటారు. అలా నష్టపోకుండా ఉండేందుకు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకోండి.


బంగార ఆభరణాలు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

1. హాల్‌మార్క్ గుర్తు తప్పనిసరిగా చూడండి

బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు వాటిపై BIS హాల్‌మార్క్ ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. హాల్‌మార్క్ ఉంటేనే మీరు కొనుగోలు చేసే బంగారం స్వచ్ఛతకు ధ్రువీకరణ లభిస్తుంది. మీరు కొనే ఆభరణంలో బంగార స్వచ్ఛత 22 క్యారెట్లా? 18 క్యారెట్లా? వంటి వివరాలు తప్పక తెలుసుకోవాలి.

2. స్వచ్ఛమైన బంగారు నగలకు ప్రాధాన్యం ఇవ్వండి

వీలైనంత వరకు అచ్చంగా బంగారంతో తయారైన నగలను కొనుగోలు చేయడం మంచిది. ఇటువంటి నగలను భవిష్యత్తులో ఎక్స్ఛేంజ్ లేదా అమ్మినప్పుడు విలువ తగ్గే అవకాశం తక్కువగా ఉంటుంది. స్వచ్ఛత తక్కువగా ఉన్న ఆభరణాలు కొంటే..




భవిష్యత్తులో వాటిని ఎక్స్ఛేంజ్ చేసినా.. అమ్మినా చాలా తక్కువ మొత్తమే వస్తుంది.

3. స్టోన్స్ పొదిగిన నగలు కొంటున్నారా జాగ్రత్త

రాళ్లు పొదిగిన నగలు కొనుగోలు చేస్తే బంగారం విలువ, రాళ్ల విలువను వేర్వేరుగా బిల్లులో చూపిస్తున్నారో లేదో చూసుకోవాలి. సాధారణంగా రాళ్లకు ఎలాంటి రీసేల్ విలువ ఉండదు. ఈ రాళ్ల విలువ కూడా చాలా తక్కువే ఉంటుంది. అందువల్ల రాళ్ల బరువును బంగారం తూకంలో కలపకుండా చూసుకోవాలి. రాళ్ల బరువును కూడా బంగారంతో కలిపి బిల్లింగ్ చేస్తే మీరు నష్టపోవాల్సి ఉంటుంది. పగడాలు, కెంపులు వంటి కొన్ని రత్నాలకు కొంత రీసేల్ విలువ ఉంటుంది.

4. కంప్యూటర్ ఇన్‌వాయిస్ మాత్రమే తీసుకోండి

తెల్ల కాగితంపై రాసి ఇచ్చే ఎస్టిమేషన్ బిల్లులను తీసుకోకుండా, దుకాణం పేరు, జీఎస్‌టీఐఎన్, బంగారం వివరాలు ఉన్న కంప్యూటర్ ఇన్‌వాయిస్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. భవిష్యత్తులో నాణ్యతపై వివాదం తలెత్తితే ఇదే చట్టపరమైన ఆధారంగా ఉపయోగపడుతుంది.

5. తరుగు, మజూరీ ఛార్జీలను ముందుగానే తెలుసుకోండి

చాలా నగల దుకాణాల్లో బంగారం ధరతో పాటు తరుగు, మజూరీ పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తారు. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఈ ఛార్జీలు ఎంత ఉంటాయో అడిగి తెలుసుకోవడం మంచిది.

6. గోల్డ్ స్కీమ్స్‌లో చేరేముందు ఇది తెలుసుకోండి

ఒకేసారి పెద్ద మొత్తంలో బంగారం కొనలేని వారు నెలవారీ గోల్డ్ స్కీమ్స్‌లో చేరుతుంటారు. అయితే ప్రభుత్వం గుర్తింపు పొందిన, విశ్వసనీయమైన నగల సంస్థల్లో మాత్రమే ఇలాంటి పథకాల్లో పెట్టుబడి పెట్టాలి.


7. పెట్టుబడి కోసం నగల కంటే నాణేలు లేదా బార్లు మంచివి

కేవలం పెట్టుబడి కోసం బంగారం కొనాలనుకునే వారు నగల కంటే బంగారు నాణేలు లేదా బార్లు కొనడం ఉత్తమం. వీటిపై మేకింగ్ ఛార్జీలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా బంగారం కొనుగోలు చేసి, అవసరమైతే భౌతిక బంగారంగా మార్చుకునే అవకాశం కూడా ఉంటుంది.

BIS Care App ద్వారా బంగారం హాల్‌మార్క్ వివరాలను స్వయంగా ధృవీకరించవచ్చు. బంగారం కొనుగోలు చేసిన వెంటనే బిల్లు, వారంటీ, హాల్‌మార్క్ వివరాలను భద్రంగా ఉంచుకోవాలి. బంగారం కొనుగోలు చేసే సమయంలో ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా మోసాలను నివారించడమే కాకుండా, భవిష్యత్తులో మంచి రీసేల్ విలువ కూడా పొందవచ్చు. హాల్‌మార్క్, సరైన బిల్లు, మేకింగ్ ఛార్జీలు, రాళ్ల విలువ వంటి అంశాలను తప్పనిసరిగా పరిశీలించి కొనుగోలు చేయాలి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 19 జూన్, 2026

www.viswamvoice.com




# కేసులుంటే.. చంపేస్తారా...?

## పవన్ కళ్యాణ్ స్పందించకుంటే చరిత్ర హీనుడిగా, కాపు ద్రోహిగా మిగిలిపోతారు
## కాపులకు కూటమిలో రక్షణ కరువు : మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హెచ్చరిక

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేసులుంటే..చంపేస్తారా...? అంటూ.. విజయవాడలో గాదే సాయికృష్ణ మృతి ఘటనపై సిట్టింగ్ జడ్జి తో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. గురువారం ఉదయం స్థానిక ప్రకాష్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా నివాసంలో జరిగిన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాయికృష్ణ మృతిపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జి తో విచారణ చేయించండి, కాపులకు కూటమిలో రక్షణ కరువు, సీఐ నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు అందరిపైన చర్యలు తీసుకోండి, కాపులను అణగదొక్క డమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం, కాపుల్ని పిచ్చి నా కొడుకుల్ని చేసి చంద్రబాబు 15 ఏళ్లు సీఎం అంటున్న పవన్,రాష్ట్రంలో కాపు ఆగ్రహానికి కూటమి పతనం ఖాయం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ గాలికి వదిలి, విచ్చలవిడితనం, ఆటవిక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, నారా లోకేష్ ఎన్నిక లకు ముందు నుంచి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తామని చెబుతున్న మెసే జ్ ను స్ఫూర్తిగా తీసుకుని రక్షకభటులైన పోలీసులు రాక్షసభటులుగా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. ఖాకీ చొక్కాలు వేసుకున్నాం అని మరిచి పోయి పచ్చ సొక్కలు వేసుకున్నట్లు లోకేష్ మాటలను సిద్ధాంతాలను అనుసరిస్తూ ఉద్యోగాలు చేస్తున్నారని, ప్రతి పోలీస్ స్టేషన్ ఒక టిడిపి కార్యాలయంలో మార్చేశారని, గతంలో టిడిపి వాళ్లు రౌడీయిజం,గుండాయిజం.. చేస్తే ఇప్పుడు రక్షక భటులే గుండాలుగా మారి....పచ్చ చొక్కాలు వేసుకొని లోకేష్ మాటలు మాత్రమే అనుస రిస్తూ ఉద్యోగాలు చేస్తున్నారు.గాదె సాయి కృష్ణ అనే కాపు యువకున్ని చంపి బూడిద చేశారు. సీబీఐ ఎంక్వయిరీ, లేదా సిట్టింగ్ జడ్జి తో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.పవన్ కళ్యాణ్ కూటమి అధికారంలోకి రావడానికి కాపులను ఒక తాటిపైకి తీసుకువచ్చి... వారిని భావోద్వేగాలకు గురి చేసి.....ఓట్లను దండుకు న్నారు.ఈ రాష్ట్రంలో లా ఎండ్ ఆర్డర్ గాడి తప్పు. తుంది.. హోం మినిస్టర్ అనితా కి చేతకాకపోతే తప్పుకోవాలని స్వయంగా పవన్ కళ్యాణ్ గతంలో చెప్పారు. ఆయన చెప్పిన మాటలే అక్షర సత్యంగా నేడు గాదే సాయి కృష్ణ మృతి ఘటన అందుకు ఉదాహరణగా నిలిచిందన్నారు. మే 9న సాయికృష్ణ పోలీసులు కస్టడీకి తీసుకుని 40 రోజులు అయింది. చిత్రహింసలు పెట్టి, థర్డ్ డిగ్రీ ఉపయోగించి ఆ యువకుడ్ని ఏం చేశారో.. ఏమ య్యాడో... తెలియదంటూ పోలీసులు చెబుతున్నారు అంటే ఏ ధైర్యం చూసుకుని మాట్లాడుతున్నారని



ప్రశ్నించారు. నా కొడుకుని చూపించండి అంటూ గుండెలు బాదుకుని మీడి యా ముందు ఆ తల్లి పడు తున్న ఆవేదన ఈ ప్రభు త్వానికి కనబడడం లేదు. నీ కొడుకు లేడు.. దండ వేయడానికి ఫోటో సిద్ధం చేసుకో అని తల్లికి పోలీసు లు చెప్తున్నారు. నా కొడుకును నాకు అప్పగించండి అని హై కోర్టులో హెబీయస్ కార్పస్ పిటిషన్ దాఖలు కోర్టు ముందు 29న హాజరు పరచాలని హైకోర్టు ఆదేశించింది. లేని మనిషిని ఎలా కోర్టుకు హాజరు పరుస్తారని ప్రశ్నిస్తున్నాం. చిత్రహింసలు పెట్టి కాళ్ల గోల్డ్ పీకించి అత్యంత కిరాతకంగా చిత్రహింసలకు గురిచేసి పంపుతారా అని ఆ తల్లి విజయలక్ష్మి ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. పోలీసులకు ఎంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. మీ జీతాలు ప్రజల పన్నులతో చెల్లిస్తుంటే టిడిపి కార్యాలయం లో నుండి తీసుకున్నట్లు పనిచేస్తారని మండిపడ్డారు. కర్నూలులో వైయస్సార్ సిపి యువజన విభాగం నేత వేధింపులు, తెనాలిలో నడిరోడ్డుపై దాడులు, గోపాలపురం నియోజకవర్గంలో నడిరోడ్డుపై వైయస్సార్సీపి కార్యకర్తలను నడిపించు కుంటూ తీసుకెళ్లారు. పోలీసులకు ఏమిటి బరితెగింపు ఏం చేసినా పర్వాలేదు అన్న ధైర్యం వచ్చిందంటే రెడ్ బుక్, రా డెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. కాపులపై అనేక రకాల దాడులు చేస్తున్నారు. వంగవీటి మోహన రంగా హత్య మొదలుకుని, ఎన్నికల్లో ఇచ్చిన కాపు రిజర్వేషన్ హామీ అమలు చేయాలని అడిగినందుకు ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని ఏరకంగా చిత్రహింసలు గురి చేశారో, కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారో చూసాం. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడు లు , నెల రోజులు జైల్లో ఉంచారు. మాజీమంత్రి పేర్ని నాని కుటుంబంలో మహిళలపై కేసులో నమోదు వంటి ఘటనలు ఎన్నో చూసాం. రాష్ట్ర వ్యాప్తంగా కాపులపై కేసులు పెట్టని పోలీస్ స్టేషన్ ఉందేమో చెప్పండి అంటూ మండిపడ్డారు. ఈ ఘటతో పవన్ కళ్యాణ్ స్పందించకపోతే చరిత్ర హీనుడి కింద.. కాపు ద్రోహి కింద చరిత్రలో నిలిచి పోతారు. లేదంటే చెప్పండి. కాపులను విడతల విడ తల వారీగా చంపుతుంటే మీరు నోరు మెదపరు అని పవన్ పై మండిపడ్డారు. కాపులంతా బతకకూడదు అంటే అంతా విజయవాడ వస్తాం. అక్కడే కాపులం దరినీ పెట్రోల్ పోసో, బాంబు లు వేసో చంపే యండి అంటూ రాజా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి హృదయ విదారకమైన పరిస్థితులు ఎదుర్కొంటే మీలో ఎందుకు చలనం లేదంటూ పవన్ ను ప్రశ్నించారు.ఎవరిపైనైనా కేసులు ఉంటే చంపేస్తారా అంటూ ప్రశ్నించారు. ఏదైనా నేరం చేసి ఉంటే పోలీసులు అదుపులోకి తీసుకునే ఉంటే 24 గంటల్లోపు కోర్టుకు హాజరపరచాలని చట్టం చెబుతుంది. హైకోర్టు సాయి కృష్ణను కోర్టు ముందు హాజరపర చమని చెబుతున్న ఎందుకు హాజరపరచ లేకపోతున్నారు. అని ప్రశ్నించారు. కచ్చితంగా ఆ యువకుడ్ని చంపేశారు కనుకే కోర్టు ముందుకు హాజరు పరచలేకపోతు న్నారన్నారు. ?? సాయి కృష్ణను చంపేసి ఇప్పుడు ఆ కుటుంబ సభ్యులతో బేరసారాలు సాగిస్తున్నారని రాజా ఆరోపించారు. కాపు కులం అమ్ముడుపోయేది కాదు. అమ్ముడు పోయే సామా జిక వర్గంగా మా కులం కనిపిస్తుందా అంటూ ప్రశ్నించారు. మరి ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ పై 90 కేసులు, నారా లోకేష్ పై 17 కేసులు, చంద్రబాబుపై 19 కేసులు ఇలా 20 మందికి పైగా టిడిపి ఎమ్మెల్యేలు మంత్రులపై రెండంకెల కేసులున్నాయి. చిత్రహింసలు చేసి పోలీస్ అధికారులు చంపేయచ్చు కదా అని నిలదీశారు. వీళ్లను ఎవరు ఎందుకు ఏమి చేయడం లేదు. టిడిపి వాళ్లు అనే కదా వదిలేస్తున్నారు. అని ప్రశ్నించారు. సాయి కృష్ణ మృతి ఘటనపై సిబిఐ విచారణ లేదా సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించాలని సిఐ నుంచి ఉన్నతాధికారి వరకు బాధ్యులైన ప్రతి ఒక్కరి పైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీజీపీ నుంచి ప్రతి ఒక్క అధికారి బాధ్యత వహించాలని, మనిషిని చంపేస్తుంటే కళ్ళప్పగించి చూస్తారా అంటూ రాజా ప్రశ్నించారు. తక్షణం యాక్షన్ తీసుకోకుంటే కాపుల ఆగ్ర హాన్నీ ఈ ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందన్నారు. కాపులపై కూటమి ప్రభుత్వ దౌర్జన్య కాండను రాష్ట్రమంతా కాపులు గమ నిస్తున్నారని, రానున్న రోజు ల్లో కాపుల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం బలి కావడం ఖాయమని అన్నారు. ఇకనైనా పవన్ కళ్యాణ్ స్పందించకుంటే చరిత్ర హీనుడిగా, కాపు ద్రోహి మిగిలిపోతారని హెచ్చరిక చేశారు.

# నెల్లిపూడిలో ఘనంగా కామ్రేడ్ ప్రసాదరావు, వసంతక్కల వర్ధంతి

**గంగవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సిపిఐ (ఎం,ఎల్) రామచంద్రన్ పార్టీ కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్ ఎం.వి.ప్రసాద్, వసంతక్కల 21వ వర్ధంతి రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో గ్రామ రైతు కూలి సంఘంఉపాధ్యక్షులు ఎం.ప్రసాద్‌రావు, సోమరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత నెల్లిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రసాద్ రావు, వసంతక్కల స్మారక స్థూపం వద్ద నెల్లిపూడి రైతు కూలి సంఘం గ్రామ నాయకులు,మహిళలు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ(ఎంఎల్)రామచంద్రన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు సురేష్ జిల్లా కమిటీ నాయకులు, బాబురావు లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి బాబురావు మాట్లాడుతూ 1962 సంవత్సరంలో నల్లగొండ జిల్లా మేళ్లదుప్పలపల్లి గ్రామంలో ఎంవి ప్రసాద్ జన్మించారు. విప్లవ రాజకీయాలకు ఆకర్షతులై పిడిఎస్యు, విద్యార్థి సంఘాలలో పని చేస్తూ విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిర్వహించారు. 1984 సంవత్సరం లో పార్టీ సూచనల మేరకు జనజీవన స్రవంతి లో కలిసిన ఆయన ఏజెన్సీ ప్రాంతం అయినటువంటి నెల్లిపూడి గ్రామంలో భూ పోరాటాలు నిర్వహించి మోకాస భూములు 800ఎకరాలను పేదలకు అందజేశారు. ఉద్యమ బాట పట్టిన అదే ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ రాజమణి (వసంతక్క)ను వివాహం చేసుకున్నారు అని గుర్తు చేశారు.2005 జూన్ 18న సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన పార్టీ తో విప్లవ సంస్థల ఐక్యత చర్చలు జరిపి హైదరాబాద్ నుండి రాజమండ్రి వస్తున్న సమయంలో నల్గొండ జిల్లా లో పక్కా ప్రణాళిక తో ప్రసాద్ దంపతులు



హత్యకు గురై నేటికీ 21 సంవత్సరాలు గడిచాయని తెలిపారు. అదే ఉద్యమ పోరాటంతో రాజ్యాంగం లో పొందుబరచిన తమ హక్కులను దక్కించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చిన్న బాబు, పెరవలి పండు, చిట్టిబాబు, యేసు,తాతపూడి మోహన్, శామ్యూల్, శివ, నాని, మణిబాబు, వెంకటరమణ, సుబ్రమణ్యం, రమణ, కృష్ణ, సూరిబాబు, వీరబాబు, నాని బాబు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

### యూఎఫ్ఎస్ డేటా ధృవీకరణను

# గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే డేటా ధృవీకరణ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 18న జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామాలు, వార్డుల్లో యూఎఫ్ఎస్ సోషల్ ఆడిట్ డేటాను ప్రజల పరిశీలన కోసం ప్రదర్శించినట్లు తెలిపారు. సదరు డేటాపై జూన్ 19న గ్రామ, వార్డు సభలు నిర్వహించి ధృవీకరణ చేపట్టాలని సూచించారు. అలాగే జూన్ 19 నుంచి 24 వరకు ప్రజలు తమ కుటుంబ వివరాలకు సంబంధించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి అందిన అభ్యర్థనలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి డేటా ధృవీకరణను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు చేయించుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. జిల్లా స్వర్ణ గ్రామ/వార్డు అధికారిణి కె. రత్న కుమారి మాట్లాడుతూ, గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యూఎఫ్ఎస్ ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### రంపచోడవరం నియోజకవర్గంపై

# జగన్‌తో కర్రి పాపారాయుడు సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం రంపచోడవరం నియోజకవర్గ వైసిపి సమావేశం నిర్వహించారు.తాడేపల్లి, వైయస్సార్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పోలవరం జిల్లా రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి సమావేశమయ్యారు.నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి, వైసిపి నియోజకవర్గం పరిశీలకులు, పార్టీ ప్రధాన కార్యదర్శి కర్రి పాపారాయుడు లు హాజరయ్యారు. రంపచోడవరం నియోజకవర్గ వైయస్సార్సీపి స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కు జగన్ పలు సూచనలు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయం గా వ్యవహరించి పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. రాబోయే మూడేళ్ల రాజకీయ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు.గిరిజన ప్రాంత కేడర్‌తో నేరుగా సంప్రదింపులు జరిపారు.గిరిజన ప్రాంతమైన రంపచోడవరం కేడర్‌తో జగన్ నేరుగా భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగులపల్లి ధనలక్ష్మి,పార్టీ పరిశీలకులు కర్రి పాపారాయుడు సమక్షంలో క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు.గిరిజన సంప్రదాయంలో తలపాగా జగన్ కు స్థానిక నాయకులు అలంకరించారు. తరచూ రంపచోడవరం నియోజకవర్గంలో పర్యటించి పార్టీ పరిస్థితి ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని కర్రి పాపారాయుడు ను జగన్ ఆదేశించారు.

# రాజమండ్రిలో కొత్త సెంటర్ ప్రారంభించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

### – అధునాతన ఫెర్టిలిటీ సంరక్షణ ఇప్పుడు మరింత అందుబాటులోకి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశంలో విశ్వసనీయ ఫెర్టిలిటీ సంరక్షణ నెట్‌వర్క్‌లలో ఒకటైన ఒయాసిస్ ఫెర్టిలిటి రాజమండ్రిలో తన కొత్త పూర్తి స్థాయి ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించింది. 16 సంవత్సరాలకు పైగా క్లినికల్ అనుభవం కలిగిన సంస్థగా ఒయాసిస్ ఫెర్టిలిటీ ఈ నూతన కేంద్రం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో తన సేవల విస్తరణకు మరో అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే విస్తృతమైన కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిన ఒయాసిస్ ఫెర్టిలిటీ, పట్టణాలు మరియు ప్రాంతీయ ప్రాంతాల్లోని దంపతులకు సమీపంలోనే నాణ్యమైన ఫెర్టిలిటీ చికిత్సలను అందిస్తోంది. రాజమండ్రి కేంద్రం ప్రారంభం ద్వారా సైన్స్ ఆధారిత, నమ్మకమైన ఫెర్టిలిటీ సేవలను మరింత మందికి చేరువ చేయాలనే సంస్థ లక్ష్యాన్ని బలోపేతం చేసింది. ఫెర్టిలిటీ సమస్యల నిర్ధారణ, చికిత్సలో సకాలంలో వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు కీలకమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అనేక ప్రాంతాల్లో ప్రత్యేక ఫెర్టిలిటీ కేంద్రాలు దూరంగా ఉండటంతో చికిత్సలో జాప్యం ఏర్పడుతున్న నేపథ్యంలో, రాజమండ్రిలో ప్రారంభమైన ఈ కేంద్రం సంప్రదింపులు, నిర్ధారణ పరీక్షలు, అధునాతన చికిత్సలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ కో–ఫౌండర్ మరియు మెడికల్ డైరెక్టర్ డా. దుర్గా జి.రావు మాట్లాడుతూ, సాక్ష్యాధారిత వైద్యం, నైతిక వైద్య ప్రమాణాలు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్సల ద్వారా సంస్థ ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు. రాజమండ్రి కేంద్రం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సకాలంలో, నాణ్యమైన ఫెర్టిలిటీ సంరక్షణ అందించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. సంస్థ సీఈఓ పుష్కరాజ్ షెనాయ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఫెర్టిలిటీ రేట్లు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రజలకు చేరువలోనే నిపుణుల సేవలు అందించడం అవసరమని పేర్కొన్నారు. రాజమండ్రి కేంద్రం ఈ ప్రాంత దంపతులకు సాక్ష్యాధారిత చికిత్సల ద్వారా తల్లిదండ్రులయ్యే అవకాశాలను మెరుగుపరుస్తుందని తెలిపారు. రాజమండ్రి కేంద్రంలోని కన్సల్టెంట్ మరియు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డా. గంగా ప్రియదర్శిని మాట్లాడుతూ, ఇప్పటివరకు ప్రత్యేక ఫెర్టిలిటీ చికిత్సల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చిన దంపతులు ఇప్పుడు స్థానికంగానే అనుభవజ్ఞులైన నిపుణుల పర్యవేక్షణలో IUI, IVF, ICSI, PGT-A వంటి ఆధునాతన చికిత్సలను పొందవచ్చని తెలిపారు. కొత్త కేంద్రం ప్రారంభంతో ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆంధ్రప్రదేశ్‌లో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకుంటూ, నగరాలు మరియు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోని దంపతులకు సమగ్ర, సైన్స్ ఆధారిత ఫెర్టిలిటీ సంరక్షణ అందించడంలో తన నిబద్ధతను కొనసాగిస్తోంది.

### రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుకు

# హృదయ పూర్వక శుభాకాంక్షలు

### ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే నాయకుడు సీఎం చంద్రబాబు : కాశి నవీన్ కుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త సానా సతీష్ బాబు రెండవసారి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయనని కలిసి తెలుగుదేశం పార్టీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ, పారిశ్రామిక రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న సానా సతీష్ బాబుకి రాజ్యసభ సభ్యత్వం మరోసారి దక్కడం వారి కృషికి లభించిన గుర్తింపని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన రాజ్యసభ వేదికగా మరింత సమర్థవంతంగా తన వాణిని వినిపిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రతిభ, అనుభవం, నిబద్ధత ఉన్న నాయకులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులను ప్రోత్సహించడం చంద్రబాబు నాయకత్వంలోని ప్రత్యేకత అని అన్నారు. రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో సానా సతీష్ బాబు అనుభవం దేశ అత్యున్నత సభలో రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దూరదృష్టి కలిగిన నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. సానా సతీష్ బాబు రాజ్యసభ సభ్యుడిగా మరింత ఉన్నత స్థాయిలో ప్రజాసేవ చేసి రాష్ట్రానికి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జగన్‌ను కలిసిన సాధనల శివ భగవాన్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మండపేట వైసీపీ నాయకులు సాధనాల శివ భగవన్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శివ భగవాన్ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం లో వైసిపి బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని జగన్ పేర్కొన్నారని తెలిపారు. నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో వైసిపి తన సత్తా చూపిస్తుందని ఆయన పేర్కొన్నారు.


విశ్వం వాయిస్ విశ్వం VOICE TV

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.

# అప్పుల భారంతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి

## రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి : గిడుగు రుద్ర రాజు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకుపోతోందని, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు లేకపోవడంతో పాటు సంక్షేమ పథకాల అమలు కూడా సక్రమంగా జరగడం లేదని కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. అమలాపురంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తూ ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు తగిన నిధులు కేటాయించలేకపోతోందని, దీంతో అనేక కీలక ప్రాజెక్టులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ విభజన ఏ ఒక్క పార్టీ నిర్ణయం కాదని, అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఆమోదించిన తర్వాతే రాష్ట్ర విభజన జరిగిందని గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రత్యేక నిధులు, ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే రాష్ట్ర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని నిలదీయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. పక్క రాష్ట్రాలకు వెళ్లి రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీపై ఆధారరహిత ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీపై అనవసర ఆరోపణలు చేస్తే ఉపేక్షించబోమని కూడా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించి గౌరవించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు తెలుగు ప్రజల అభివృద్ధికి, రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, వడ్డీ నాగేశ్వరరావు, కోట శ్రీనివాసరావు, కుడిపూడి శ్రీనివాసరావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, సరెళ్ల ప్రసన్న తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వపాఠశాలో విద్యార్థులకు

# ఉచితంగా నోటు పుస్తకాల అందజేత



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలంలో గత 20 ఏళ్లుగా అందిస్తున్న విద్యదాత కర్రి శ్రీనివాస్ విద్యా సేవ సమితి అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఎందరో పేద విద్యార్థులకు అండగ ఉంటున్నారు. కాట్రేనికోన మండలం నడవపల్లిలోని పల్లిపాలెం గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాస్ చదువుకునే వారంటే చాలా ఇష్టం. ఆయన కూడా తాను చదువుకునే రోజుల్లో ఎన్నో కష్టాలు అనుభవించారు. తనలా పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఎవరు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు అండగా ఉంటున్నారు. గత 20 ఏళ్లుగా ప్రతి ఏడాది జూన్ 15న తన పుట్టిన రోజును పురస్కరించుకుని వందలాది మంది పిల్లలకు నోటు పుస్తకాలను అందజేస్తున్నారు. కుంచనపల్లి, పల్లిపాలెం, పల్లంకుర్రు, కుండలేశ్వరం, నడవపల్లి, లచ్చిరాజుచెరువు, వెంకమ్మచెరువు, కొప్పిగుంట, తదితర ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ప్రతి ఏడాది నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, అరెజేర్లు ఉచితంగా అందిస్తున్నారు. గతేడాది 650 మంది పిల్లలకు పుస్తకాలు అందించగా ఈ ఏడాది ఇంతవరకు 450 మంది వరకు పుస్తకాలు అందజేసారు. దీనిలో భాగంగా గురువారం నడవపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను శ్రీనివాస్ సోదరుడు రామకృష్ణ చేతుల మీదుగా అందించారు. పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు తన వంతుగా ఏదైన చేయాలనే ఆలోచనతోనే గత 20 ఏళ్లుగా విద్యార్థులకు పుస్తకాలు, విద్య సామాగ్రి అందిస్తున్నాను అని దాత కర్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు కొనియాడారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు ఆయన అండగా ఉండటం ఎంతో అభినందనీయమన్నారు. హెచ్ఎం సుందరరావు, నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యారులు పాల్గొన్నారు.

# కొండేటికి సీనియర్ పాత్రికేయుల నివాళి



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** పాత్రికేయుడు, విశాలాంధ్ర దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ కొండేటి సత్యనారాయణఇటీవల తనువు చాలించిన సంగతి తెలిసిందే. కాట్రేనికోన సచివాలయం వద్ద గురువారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు పాత్రికేయులు హాజరయ్యారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జర్నలిస్టుగా సత్యనారాయణ సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగావీరు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో అయితా బత్తులశీను బాబు, గోనెమడతల బ్రహ్మాజీ, మట్టపర్తి రవి, కాశి సురేష్, గంటి బోస్, కొంకి రవి, జగడం శ్రీనివాస్,బడుగు శ్రీనివాస్, కాశి చక్రితదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి పిలుపు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని డాక్టర్ చలికాని రామారావు స్మారక భవనంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకట సుబ్బయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ నెల 29న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 24న విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం చేపట్టే నిరసనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా విశాలాంధ్ర పత్రికా విలేకరి కొండేపూడి సత్యనారాయణ అకాల మరణానికి సమావేశం నివాళులర్పించింది. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బి.వి.వి. కొండలరావు మాట్లాడుతూ అనుబంధ సంఘాలు జాతీయ, రాష్ట్ర శాఖలకు అనుబంధ రుసుము చెల్లించి సభ్యత్వాలను పునరుద్ధరించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ జిల్లాలో అసంఘటిత రంగంలోని ఆటో యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం, శ్రామిక మహిళా సంఘం వంటి అనుబంధ సంఘాల మహాసభల నిర్వహణతో పాటు కార్యాలయం బలోపేతానికి తీసుకోవాల్సిన కార్యాచరణను వివరించారు. సమావేశంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర మహాసభల ఖర్చుల వివరాలను ఫైనాన్స్ సెక్రటరీ శ్రీమతి పద్మ ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సిపిఐకి ఏఐటీయూసీ కీలకమైన శ్రామిక శక్తి అని సంస్థను బలోపేతం చేయడం ద్వారా ఉద్యమాలు మరింత ఉధృతం చేయవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ముమ్మిడివరం మున్సిపల్ కార్మికులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుని ముందుకు సాగాలని సూచించారు. లేబర్ కోడ్స్ ఉపసంహరణ, ఔట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, 12వ పిఆర్సి అమలు తదితర డిమాండ్ల కోసం ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామని కౌన్సిల్ సభ్యులు, వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు తీర్మానించారు.

# ఓటర్ల జాబితా సవరణపై ఆర్డీవో కీలక ప్రకటన

## ప్రజలు బాధ్యతాయుతంగా సహకరించాలి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ఆర్డీవో స్పందిస్తూ, ప్రజాస్వామ్య బలోపేతానికి ఈ ప్రక్రియ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2025 ఓటర్ల జాబితాను, 2002 నాటి జాబితాతో అనుసంధానం చేస్తూ ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం, పారదర్శకతను నిర్ధారించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వచ్చి ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తారని.వాటిని ఓటర్లు జాగ్రత్తగా పరిశీలించి వివరాలను సరిచూసుకుని తిరిగి వారికి అందజేయాలని ఆర్డీవో కోరారు. జాబితా తయారీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండేందుకు ప్రతి ఓటరు ఈ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా పూర్తి చేసి సమర్పించవలసిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. అలాగే జూలై 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు కూడా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ముఖ్యమని ఈ సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని ఆర్డీవో విజ్ఞప్తి చేశారు.

### హోం మంత్రి వంగలపూడి అనితకు వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్

# బేషరతుగా క్షమాపణ చెప్పాలి

## మహిళా లోకాన్ని అవమానించారంటూ రామచంద్రపురంలో నిరసన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి మరియు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు వజ్రపు రాజేశ్వరి, బళ్ల లక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుడివాడ అమర్‌నాథ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాస్తి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న మహిళా మంత్రిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలే గానీ వ్యక్తిత్వ హననానికి దిగడం వైసీపీ సంస్కృతికి నిదర్శనమన్నారు. మహిళలను గౌరవించని పార్టీకి ప్రజలు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని అయినప్పటికీ వారి వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అంటే రాష్ట్రంలోని మహిళా సమాజాన్ని అవమానించినట్టేనని అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం అసభ్య పదజాలంతో మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు. వజ్రపు రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ అంశాలపై సమాధానం చెప్పలేక వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడలేని వారు వ్యక్తిగత దూషణల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా మంత్రిని అవమానించడం అంటే ఆంధ్రప్రదేశ్ మహిళా లోకాన్ని అవమానించినట్టేనని అన్నారు. వైసీపీ నాయకులు తమ రాజకీయ దివాళాకోరుతనాన్ని అసభ్య వ్యాఖ్యల ద్వారా బయటపెడుతున్నారని విమర్శించారు. విమర్శలకు తాము ఎప్పుడూ సిద్ధమేనని అయితే వ్యక్తిత్వ హననాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రజలు తిరస్కరించినా అహంకార రాజకీయాలను వైసీపీ నాయకులు ఇంకా కొనసాగిస్తున్నారని మాటలకు హద్దులు ఉండాలని ప్రజాస్వామ్యంలో సంస్కారం కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో

# దేవాదాయ శాఖ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఈరోజు ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. రాష్ట్రంలోని ఆలయాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ రూపొందించిన ఎస్.ఓ.పి నిబంధనల అమలును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శానిటేషన్, తాగునీటి సదుపాయం, అన్నప్రసాదాల నాణ్యత మరియు మరుగుదొడ్ల నిర్వహణను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం భక్తులకు అందుతున్న సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నప్రసాద భవనంలోని స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న సరుకుల నాణ్యతను పరిశీలించిన కమిషనర్ భక్తులతో కలిసి స్వయంగా అన్నప్రసాదాన్ని స్వీకరించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దేవాలయంలో కేంద్ర పురావస్తు శాఖ నిబంధనలకు అనుగుణంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కార్యనిర్వాహణాధికారికి ఆయన తగు సూచనలు జారీ చేశారు. అలాగే ప్రాశస్త్యం కలిగిన సప్త గోదావరిని పరిశీలించిన తర్వాత ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆ నది విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ, రామచంద్రపురం తనిఖీదారు ఆర్. బాలాజీ రాంప్రసాద్, ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీమతి ఏ.వి. దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో రూ.5 లక్షలతో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ పేర్కొన్నారు. పట్టణంలోని 4వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న హెచ్‌డీబీ పైప్‌లైన్ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దూరదృష్టితో రామచంద్రపురం వేగంగా అభివృద్ధి చెందుతోందని గత రెండు సంవత్సరాల్లోనే పట్టణ అభివృద్ధి కోసం సుమారు రూ.40 కోట్ల నిధులను కేటాయించి పలు కార్యక్రమాలను పూర్తి చేశామని తెలిపారు. ఏళ్ల తరబడి ఇబ్బంది పెడుతున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా మంత్రి సుభాష్ చేస్తున్న కృషిని ప్రజలు అభినందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ మెరుగైన పాలన అందిస్తోందని వివరించారు. మంత్రి సుభాష్ చొరవతో నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ పురోగమిస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

శుక్రవారం, 19 జూన్ 2026
www.viswamvoice.com





కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని

# మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీని రాజ్యసభ సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యులుగా రెండోసారి ఎన్నికైన అనంతరం తొలిసారిగా కాకినాడ జిల్లాకు విచ్చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, గోడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకు సాదర స్వాగతం పలికి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా మరోసారి ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజా సేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తొలిసారిగా తన నివాసానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును ఎమ్మెల్యే నానాజీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్, జనసేన పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై కాకినాడ ఎక్సైజ్ శాఖ

# స్పెషల్ డ్రైవ్ 19 కేసులు నమోదు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమ మద్యంపై భారీగా దాడులు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో భాగంగా అనధికార మద్యం పౌచులు విక్రయిస్తున్న వారిపై 9 కేసులు నమోదు చేసి, 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 46 అక్రమ మద్యం సీసాలుమరియు 7 లీటర్ల నాటుసారాస్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై 10 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. లైసెన్స్ కలిగిన పర్మిట్ రూమ్‌లలో మాత్రమే మద్యం సేవించాలని, బహిరంగ ప్రదేశాల్లో తాగడం చట్టరీత్యా నేరమని ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. అక్రమ మద్యం, బహిరంగ మద్యపానంపై ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగుతాయని హెచ్చరించారు.

ఇంటర్ బెటర్మెంట్ ఫలితాల్లో

# మోడరన్ జూనియర్ కాలేజీ విజయ భేరి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం ప్రకటించిన ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాలలో మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు రికార్డు స్థాయి ఫలితాలు సాధించి సరికొత్త టౌన్ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీ నందు వి. మధులత 470 మార్కులకు గాను 467 సాధించి సరికొత్త టౌన్ రికార్డు సృష్టించినట్లు తెలిపారు.అలాగే జూనియర్ బైపీసీ నందు కె. వి. శ్రీనికిత 455 మార్కులకు గాను 451 మార్కులు సాధించి టౌన్ అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. అలాగే సెకండ్ ఇంటర్ ఎంపీసీ నందు 1000 మార్కులకు పివివిఎస్ఎస్ సంజన, ఎ.మనోజ్ 990 మార్కులు సాధించి సరికొత్త టౌన్ రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. అలాగే సీనియర్ బైపీసీ నందు 1000 మార్కులకు కె.గీతాశ్రీ కూడా 988 మార్కులు సాధించి టౌన్ రికార్డ్ సృష్టించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్ మాట్లాడుతూ.... ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతి అకాడమిక్ ఇయర్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం తమకు ఆనవాయితీగా మారిందని వ్యాఖ్యానించారు. గ్రామీణ స్థాయి విద్యార్థులను రాష్ట్రస్థాయి ర్యాంకర్లుగా తీర్చిదిద్దేలా అత్యుత్తమ బోధన చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను మోడరన్ అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు, ప్రిన్సిపాల్ సిహెచ్ రాజేష్,అకాడమిక్ డైరెక్టర్ కె. సాయిరాం చౌదరి,వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్. ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

గంగవరం ఉన్నత పాఠశాలలో సోషల్ మీడియా ప్రమాదాలు, 'శక్తి' యాప్ వినియోగంపై

# విద్యార్థినులకు అవగాహన సదస్సు

**గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థినుల కోసం సోషల్ మీడియా వినియోగం, దాని వల్ల ఎదురయ్యే ముప్పులు మరియు వ్యక్తిగత భద్రతా అంశాలపై ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.ఐ. సోమేంద్ర, ఏ.ఎస్.ఐ. బి.వి.ఎస్. సత్యనారాయణ, కానిస్టేబుల్ లావణ్య గారు హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సోషల్ మీడియా అవసరమే అయినప్పటికీ విద్యార్థినులు దానిని ఉపయోగించే క్రమంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, వ్యక్తిగత ఫోటోలు లేదా వివరాలను సోషల్ మీడియాలో షేర్ చేయడం వంటి పనులు ప్రమాదకరమని వీటి ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడే అవకాశం ఉందని వివరించారు. ఎవరైనా సరే సోషల్ మీడియా వేదికల ద్వారా మిమ్మల్ని వేధించినా, అసభ్యకరంగా మాట్లాడినా లేదా భయపెట్టినా ఆ విషయాన్ని ఏమాత్రం దాచకుండా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'శక్తి' యాప్ ప్రాముఖ్యతను ఈ సందర్భంగా విద్యార్థినులకు వివరించారు. ఈ యాప్‌ను మొబైల్ ఫోన్లలో ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలో మరియు ఆపద సమయంలో దానిని ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా తెలియజేశారు.



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'కంప్లైంట్ బాక్స్' గురించి ప్రస్తావిస్తూ విద్యార్థినులకు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే ఆ బాక్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఆ బాక్స్‌ను పోలీసులు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తారని భరోసా ఇచ్చారు. పాఠశాలలోనే కాకుండా, బయట ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బంది పెట్టినా భయపడకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ అవగాహన సదస్సు విద్యార్థినుల్లో ధైర్యాన్ని నింపడమే కాకుండా.తమ భద్రత పట్ల అవగాహన పెంచుకోవడానికి ఎంతో దోహదపడింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పుట్టినరోజును సేవా దినోత్సవంగా మార్చిన

# ప్రజలకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ కృతజ్ఞతలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, "నా మానవ జన్మ సార్థకమైందనే ఆత్మసంతృప్తి ఈ పుట్టినరోజు నాకు కలిగింది. జూన్ 17న రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 100 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించి వేలాది మంది పేదలకు అండగా నిలవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, వృద్ధులకు వస్త్రాల పంపిణీ, ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు రాష్ట్రం నలుమూలలా జరగడం నా జీవితంలో మరపురాని ఘట్టం" అని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా మాత్రమే కాకుండా ఒక సాధారణ మనిషిగా సమాజానికి సేవ చేసే అవకాశం కల్పించిన భగవంతునికి రుణపడి ఉంటానని రాజకీయంగా తనపై నమ్మకం ఉంచి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. నన్ను గుండెల్లో పెట్టుకుని అత్యధిక మెజారిటీతో గెలిపించిన రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, మీ అందరి ప్రేమాభిమానాలకు తలవంచి పని చేస్తానని, ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవే నా ధ్యేయం అని ఆయన అన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో 130 మంది మహిళలకు ఉపాధి కల్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అలాగే తాను దత్తత తీసుకుని చదివిస్తున్న 137 మంది అనాథ పిల్లల ముఖాల్లో ఆనందం, చిరునవ్వులు చూడటం తనకు లభించిన అతిపెద్ద పుట్టినరోజు కానుక అని ఒక మనిషికి ఇంతకంటే గొప్ప ఆత్మసంతృప్తి ఏముంటుందని, నిజం చెప్పాలంటే ఆ కిక్కే వేరు అని ఆయన వ్యాఖ్యానించారు. తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నమస్సుమాంజలి తెలియజేస్తున్నానని మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, ఆశీస్సులు తనకు మరింత బాధ్యతను పెంచాయని చెప్పారు. నా జీవితంలోని ప్రతి క్షణం ప్రజల కోసమేనని పేదల సంక్షేమం, మహిళా సాధికారత, యువత ఉపాధి, అనాథల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ఈ జీవితం ప్రజాసేవకే అంకితం అని మరోసారి ప్రకటిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధిగా కోరుకుంటున్నానని మంత్రి సుభాష్ తెలిపారు.

ఓటరు జాబితాలో

# పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలి

**ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన**
**– రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం స్థానిక 3వ వార్డులో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, కొత్త ఓటర్లు నమోదు చేసుకోవడంతో పాటు చిరునామా మార్పులు, ఇతర సవరణలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రజలు సహకరించి సార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీ నాయకులు, వార్డు ప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా వ్యవహరించాలి


**కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ, అమిత్ షా రాజకీయ దురుద్దేశ్యంతో క్రిస్టియన్ మైనార్టీ, ముస్లింల ఓట్లు తొలగించాలని ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిందని కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లాలోని అసెంబ్లీ కో ఆర్డినేటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో టీకే మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షుడు మల్లి ఖార్జున ఖర్గే, కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఎస్ ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా వ్యవహరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనికి సంబంధించిన మెటీరియల్‌ను కూడా అందించామని, ప్రజలు ఎటువంటి ఇబ్బందినైనా వారి దృష్టికి తేవాలని సూచించారు. సెప్టెంబర్ 22న ఓటర్ల తుది జాబితా విడుదలవుతుందని, అప్పటి వరకు జరిగే ప్రక్రియపై ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరపున నియమించిన కో ఆర్డినేటర్లు, బిఎల్ఎలు సహకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా, బిఎల్ఓల నెంబర్లు, చిరునామాలు కూడా కో ఆర్డినేటర్లకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కో ఆర్డినేటర్లు మార్టిన్ లూథర్, మేడవరపు భద్రం దొర, యేసు, తాడాల కొండరాజు, పార్టీ నాయకులు ఆకుల సూర్య భాగ్యలక్ష్మి, చిన్నం మురళీకృష్ణ, సింధియా రాణి, బర్రే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా సత్యనగర్ బాధితులకు న్యాయం చేయాలి

**ఆర్డీఓ కార్యాలయం వద్ద టీకే విశ్వేశ్వరరెడ్డి ఆందోళన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని ఇందిరా సత్య నగర్‌లో ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు తొలగించి వారిని కుటుంబాలతో సహా రోడ్డున పడేసారని కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆ మేరకు సబ్ కలెక్టరేట్ వద్ద బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఇందిరా సత్య నగర్ పుంత రోడ్డును సర్వే చేయకుండా ఎలా ఇళ్లు తొలగిస్తారని అధికారులను నిలదీసారు. ఆక్రమణలైతే ఆ ఇళ్లకు పన్నులు ఎలా వేసారని, కరెంటు కనెక్షన్, విద్యుత్ సదుపాయం ఎందుకు ఇచ్చారని ధ్వజమెత్తారు. సుమారు 50 సంవత్సరాలుగా అక్కడ నివాసం ఉంటున్న వారికి ఆకస్మాత్తుగా జేసీబీలతో వచ్చి బలవంతంగా ఇళ్లు తొలగించి రోడ్డున పడేసారని మండిపడ్డారు. అక్కడ 80 అడుగులకు సర్వే చేసి 40 అడుగులు రోడ్డు నిర్మాణం చేసిన మిగిలిన 40 అడుగుల్లో జి ప్లస్ 1 లేదా 2 ప్రాతిపదికన ఇళ్లు నిర్మాణం చేయాలని డిమాండ్ చేసారు. అక్కడ ఉంటున్న పేదలపై ప్రతాపం చూపించిన అధికారులు పెద్దలను మాత్రం ఎందుకు వదిలేసారని నిలదీసారు. ఒక వైపు వర్షాలు పడుతున్నాయని కట్టుబట్టలతో రోడ్డున పడిన వారి పరిస్థితిని ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ఆర్డీఓ శివరాముడుని కలిసి వినతి పత్రం అందచేసారు. ఆయన చాలా సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారని టీకే అన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై

# ప్రజలకు ఇంటింటికీ అవగాహన కల్పించాలి


**మరుకుర్తి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జనకళ్యాణ్ శిబిరాన్ని ప్రారంభించిన పీవీఎన్ మాధవ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక కోటగుమ్మం వద్ద యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో, బీజేపీ ఓబీసీ మోర్చా మరియు మహిళా మోర్చా సంయుక్తంగా నిర్వహించిన జన కళ్యాణ్ శిబిరాన్ని బీజేపీ నాయకుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ దేశ ప్రజలెవరూ పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగుతోందని తెలిపారు. తపాలా శాఖ ద్వారా అతి తక్కువ వ్యయంతో భీమా పథకాలు అందుబాటులో ఉండటంతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలను కూడా కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా పటిష్ట కార్యాచరణ చేపట్టిందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మోదీ సైనికులు జన కళ్యాణ్ శిబిరంలో నమోదు చేసుకుని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఇంటింటికీ అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర నాయకులు అడబాల రామకృష్ణ, క్షత్రియ బాల సుబ్రహ్మణ్య సింగ్, నర్సిపల్లి హారిక, పాలడుగుల శ్రీవిద్య, తగరం సురేష్, ఏపీఆర్ చౌదరి, కురగంటి సతీష్, నీరుకొండ వీరన్న చౌదరి, మద్దిపాటి స్వర్ణ రజనీ, యానాపు యేసు తదితరులు పాల్గొన్నారు.

# కమ్మ కార్పొరేషన్ వైయస్సార్ ప్రభుత్వ హయాంలోనే ఆరంభం

**కమ్మ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయింపా..???**
**వైసీపీ ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆ సామాజిక వర్గం అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకుందని వైసీపీ ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు విమర్శించారు. విజయలక్ష్మి నగర్‌లోని వైసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కమ్మ సామాజిక వర్గ సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో కమ్మ సామాజిక వర్గం కోసం 2021లో కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి జగన్ అండగా నిలిచారని గుర్తు చేశారు. అలాగే రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య, వెలమ, రాజు సామాజిక వర్గాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ల ద్వారా గత ప్రభుత్వం నిధులు కేటాయించి తోడ్పాటు అందించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోలను పక్కనపెట్టి కార్పొరేషన్లను నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయలేదని విమర్శించారు. టీడీపీ అగ్రకులాలను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. అగ్రకులాల్లోనూ నిరుపేదలు ఉన్నారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కమ్మ సామాజిక వర్గం చైతన్యవంతమైన వర్గాల్లో ఒకటైనా, ఆ వర్గంలోనూ ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. కుటుంబాలను పోషించలేని స్థితిలో ఉన్న అనేక మంది తమ సామాజిక వర్గంలో ఉన్నారని వివరించారు.కూటమి ప్రభుత్వంలో ఉన్న కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్, సభ్యులు కలిసి ఆ వర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కమ్మ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో పేద కుటుంబాల మహిళలకు అందించిన విధంగా రూ.15 వేల ఆర్థిక సాయం మళ్లీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రెండేళ్ల కుటమి ప్రభుత్వ పాలనలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తూ, ప్రజారంజక పాలన కూటమి తోనే సాధ్యం అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మండపేట బస్ స్టాండ్ వద్ద శ్రీ సూర్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే సభా ఏర్పాట్లు గురువారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. నేడు ఉదయం 09:30 లకు నియోజకవర్గ స్థాయిలో జరగనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల నుంచి మంచి మన్ననలు పొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనరు టి.వి. రంగారావు ఎండి ఓ కె. సత్యనారాయణ , డిప్యూటీ ఎంపిడిఓ అనిల్ కుమార్, టిడిపి నాయకులు శిరంగు ఈశ్వరరావు ,అన్నా కాంటీన్ చైర్మన్ కాశీన కాశీ విశ్వనాథం, మున్సిపల్ డి.ఇ. కె. శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ డి. పవన్ కుమార్, తదితరలు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
శుక్రవారం, 19 జూన్ 2026
www.viswamvoice.com



# ప్రజలతో మమేకం... సమస్యలకు పరిష్కారం

**21, 22, 23 డివిజన్లు కూటమికి కంచుకోటలు - అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలే మా ఎజెండా**
**మహిళలు... వర్తకుల జోలికి వస్తే తాట తీస్తాం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**
**"మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలతో ముఖాముఖి**
**అభివృద్ధి పనులు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, పుష్కరాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే వివరణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "ప్రజలతో మమేకం... సమస్యలకు పరిష్కారం" అన్నదే తమ ప్రధాన లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి వేగంగా పరిష్కారం చూపించడమే తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న చిన్నా పెద్దా సమస్యలన్నీ శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, నగర అభివృద్ధి అనేది కేవలం కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో మార్పు కనిపించేలా ఉండాలన్నారు. అందుకే ప్రజల మధ్యే ఉంటూ, వారి అభిప్రాయాలు, అవసరాలు, సూచనల ఆధారంగా ముందుకు వెళ్తున్నామన్నారు. రాజమహేంద్రవరం నగర ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వెంటనే పరిష్కరించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేపట్టిన "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. దీనిలో భాగంగా గురువారం రాత్రి 21, 22, 23 డివిజన్ల కు సంబంధించి వంకాయలవారి వీధిలో ఉన్న స్వర్గీయ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వారి నివాసం వద్ద నిర్వహించిన "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పాల్గొని మాట్లాడారు. 21, 22, 23 డివిజన్లు కూటమికి కంచుకోటలని, ఈ ప్రాంతంలో పార్టీ జెండా ఎగురవేయడంలో కార్యకర్తల త్యాగం, కృషి ఎనలేనిదన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీల బలం నాయకుల వల్ల కాకుండా నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల వల్లే పెరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఆలయాలు ఉండటంతో వివిధ ఆలయ పాలక మండళ్ళు, ఎండోమెంట్స్ కమిటీలు, చాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థల్లో 21, 22, 23 డివిజన్లకు చెందిన నాయకులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులకు సముచిత ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు. ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 21వ డివిజన్‌లో ఇప్పటికే రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.89 లక్షల విలువైన పుష్కరాల పనులు ప్రతిపాదించామని తెలిపారు. 22వ డివిజన్‌లో రూ.3.55 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, 23వ డివిజన్‌లో సుమారు కోటి రూపాయలతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి భవిష్యత్తులో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఉన్న వాటినే తొలగించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజమహేంద్రవరం నియోజకవర్గంలోనే 722 కొత్త పెన్షన్లు మంజూరు చేశామని, 8 వేల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని తెలిపారు. త్వరలో మరో 3 లక్షల కొత్త పెన్షన్లను రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేయనున్న నేపథ్యంలో నియోజకవర్గానికి సుమారు 1,500 పెన్షన్లు వచ్చే అవకాశం ఉందన్నారు. దశాబ్దాలుగా కలగా ఉన్న గోదావరి రివర్ ఫ్రంట్‌ను కూటమి ప్రభుత్వమే సాకారం చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని, ఫేజ్-1, ఫేజ్-2లను అనుసంధానించే బ్రిడ్జిని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతామని, దుర్గం చెరువు తరహాలో సెల్ఫీ పాయింట్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పద్మావతి ఘాట్ మెట్లు, నిర్మాణాలు దెబ్బతిన్న నేపథ్యంలో రూ.2 కోట్లతో మరమ్మత్తు పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. చందా సత్రం అభివృద్ధికి రూ.1.50 కోట్లు, నూనె వర్తకుల లక్ష్మీనారాయణ అన్నదాన సమాజానికి నిధులు, గంటలమ్మ ఆలయానికి రూ.70 లక్షలు, వేణుగోపాలస్వామి దేవస్థానానికి రూ.30 లక్షలు, ఉమా మార్కండేయస్వామి ఆలయానికి రూ.30 లక్షలు, జంపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.13 లక్షలు, వంకాయలవారి వీధి వినాయక ఆలయానికి రూ.6 లక్షలు, విజయసంపద గణపతి ఆలయానికి రూ.8.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉమా మార్కండేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం లోపలి భాగం పూర్తిగా శిథిలమైపోయిన విషయాన్ని గుర్తించి, 58 అడుగుల ప్రత్యేక వృక్షాన్ని సేకరించి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ నిర్వహించామని తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు వారి నివాసాన్ని హెరిటేజ్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా రూ.30 లక్షలు, అదనంగా రూ.10 లక్షలతో మరమ్మత్తు పనులు చేపట్టినట్లు వివరించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజమహేంద్రవరం నగరానికి ఐదు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించామని తెలిపారు. భవిష్యత్తు 40-50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రణాళిక రూపొందించామని చెప్పారు. గోదావరి గట్టు ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ పవర్ కేబుల్ పనులు కూడా కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండేళ్లలో 130 మంది అసాంఘిక శక్తులపై రౌడీషీట్లు తెరిచామని, 13 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని వెల్లడించారు. గంజాయి, సారా మాఫియాలపై యుద్ధం కొనసాగుతోందని, మహిళల భద్రత విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళల రక్షణ కోసం "మహిళా రక్షక్" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో 23 పార్కులను అభివృద్ధి చేసి వాటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి పారిశుద్ధ్యం కీలకమని, డ్రైనేజీల ఆధునీకరణ, మురుగునీటి పారుదల వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు మరింత సమన్వయంతో పనిచేయాలని, పరస్పర గౌరవంతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. రాజకీయ అవకాశాలు రాని కార్యకర్తలు నిరాశ చెందవద్దని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఓల్డ్ సిటీ ప్రాంతానికి ఎలాంటి నష్టం జరగదని, రోడ్డు విస్తరణ పేరుతో ఎవరినీ ఇబ్బంది పెట్టబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కొన్ని వర్గాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. రాత్రి అక్కడే కార్యకర్తలు, నాయకులతో కలిసి విందు స్వీకరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ టీడీపీ సీనియర్ నాయకులు, నాళం భీమరాజు వీధిలోని శ్రీ సిద్ధి లక్ష్మీ గణపతి ఆలయ చైర్మన్ మద్ది నారాయణరావు నివాసంలో రాత్రి బస చేశారు. నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నల్లం శ్రీను, శెట్టి జగదీష్, మాటూరి సిద్ధు, యిన్నమూరి దీపు, నిమ్మలపూడి గోవింద్, తావ్వా రాజా, కొల్లి బుజ్జి, బూరా రామచంద్రయ్య, నరసింహమూర్తి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**నామినేటెడ్ పోస్టుల భర్తీలో ముస్లింలకు**

# కూటమి ప్రభుత్వం వెన్నుపోటు

**ఇచ్చిన హామీలు ఏమయ్యాయి : షేక్ & షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆలీ ఖాన్ బాబా**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి పాటుపడుతున్నానని, వక్ఫ్ భూములను కాపాడుతామని హామీ ఇచ్చి అందలం ఎక్కిన కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను వెన్ను పోటు పొడిచిందని రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా మండిపడ్డారు. రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వం పాలన పూర్తయిన సందర్భంగా మైనార్టీలకు వెన్నుపోటు పొడిచిందని గుర్తు చేశారు. ఎన్నికలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి ఈరోజు వరకు అమలు చేయలేదన్నారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలు గుర్తు చేశారు. 50 సంవత్సరాలకే పెన్షన్లు ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. ఆ హామీ అమలు చేయలేదని మండి పడ్డారు. పెళ్ళి కానుక జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇచ్చారన్నారు. పెళ్లి చేసుకున్న వారికి లక్ష రూపాయలు ఇచ్చేవారన్నారు. అది అమలు చేయడం లేదని విమర్శించారు. ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చులకి రూ లక్ష రూపాయలు వారి అకౌంట్లోకి వేసేవారన్నారు. ఈ పథకానికి వెన్నుపోటు పొడిచి రెండు సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రతి మసీదుకు నెలకు మసీదు నిర్వహణకు 5000 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అది నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్టు అబద్ధాలు చెబుతూ ముస్లిం మైనారిటీలను ఇంకెంతకాలం మోసం చేస్తావ్ బాబూ అని ప్రశ్నించారు. నూర్‌బాషాల (దూదేకుల) ఆర్థిక ఉన్నతి కోసం ప్రత్యేకంగా ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తానని 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. మళ్లీ అదే హామీని 2024 ఎన్నికల్లోనూ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత నూర్‌బాషాలకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వక్ఫ్ భూములను కాపాడుతున్నానని, ముస్లింల కోసం ఐటీ పార్కులు ఏర్పాటు చేస్తున్నానని చంద్రబాబు చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ముస్లిం సమాజానికి ఉపయోగపడాల్సిన వక్ఫ్ భూములను ఐటీ పార్కుల పేరుతో అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారనీ విమర్శించారు. ఇమామ్, మౌజన్‌లకు ఆరు నెలల బకాయిలు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 1,500 మసీదుల దరఖాస్తులను పరిశీలించి వాటిలో పనిచేసే ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఎందుకు మంజూరు చేయడంలేదన్నారు. మైనారిటీలకు బడ్జెట్లలో ఎంత కేటాయించారని ప్రశ్నించారు. దానిలో ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కనీసం పేద ముస్లింలకు పండుగ వేళ రంజాన్ తోఫా కూడా ఇవ్వలేదన్నారు. నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముస్లింలు ముందుకు సాగేలా ప్రోత్సహించాలన్నారు. తగిన సమయంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# సుధీర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా మండపేట హైస్కూల్ జట్టు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కే.గంగవరం మండలం పామర్రు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 6 నుండి 18 వరకు జరిగిన సుధీర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ లో మండపేట హైస్కూల్ జూనియర్స్ జట్టు ఫైనల్ లో విజేతగా నిలిచింది. నాకౌట్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ లో మొత్తం 32 జట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుండి ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ గురువారం సుధీర్ లెవెన్ జట్టుపై మండపేట జూనియర్స్ జట్టు విజయం సాధించి కప్పు సాధించారు. తొలుత మండపేట హైస్కూల్ జట్టు 15 ఓవర్స్ లో బ్యాటింగ్ చేసి 141 పరుగులు చేసింది. సుదీర్ జట్టు 121 పరుగులు మాత్రమే చేయడం తో మండపేట గెలిచింది. ముహమ్మద్ సర్దార్ 18 బంతుల్లో 41 పరుగులు చేశాడు. మూడు ఓవర్ లు వేసి 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసాడు. అల్ రౌండర్ ప్రతిభ కనబరచడం తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. జట్టు కెప్టెన్ మహమ్మద్ రఫీ, వైస్ కెప్టెన్ మణి శంకర్, జట్టు సభ్యులు సాయి కుమార్, అచ్యుత్, శ్రీరామ్, ఎండి కాలీమ్, ఎండి రీహన్, ముహమ్మద్ సర్దార్, సురేష్, సత్యనారాయణ, సునీల్, వల్లీ, తాజు, తేజాలు ఆడారు. ప్రైజ్ మని రూ 20 వేలు గెలుపొందారు. రన్నర్‌గా సుధీర్ లేవన్ నిలిచింది. ఆ జట్టు కు రూ 10 వేలు అందజేశారు. ముఖ్య అతిథులు విజేతలను అభినందించారు.

**వాహనదారులు**

# హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**రూరల్ సీఐ పి.దొరరాజు**



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** రోడ్డుపై ప్రయాణాలు చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని రూరల్ సీఐ పీ దొరరాజు సూచించారు. గురువారం ఇప్పనపాడులో రూరల్ ఎస్ఐ వి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. సుమారు 80 శాతం ప్రమాదాలు ఇంటికి రెండు కిలోమీటర్ల పరిధిలోనే జరుగుతున్నాయని, దగ్గరే కదా అనే నిర్లక్ష్య ధోరణి ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరించారు. మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 129 ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ 1000 జరిమానా విధించబడుతుందని తెలిపారు. జరిమానా కంటే ప్రాణం విలువైనదని పేర్కొన్నారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో సుమారు 70 శాతం మరణాలు తలకు గాయాలు కావడం వల్లనే సంభవిస్తున్నాయని చెప్పారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన నాణ్యమైన హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రమాద తీవ్రతను 85 శాతం వరకు తగ్గించవచ్చన్నారు. ముఖ్యంగా ఫుల్‌ఫేస్ హెల్మెట్ ధరించి, దాని స్ట్రాప్‌ను సరిగా బిగించడం ఎంతో అవసరమని సూచించారు. హెల్మెట్ పోలీసుల కోసం కాదు, తమ ప్రాణాలు, కుటుంబ భవిష్యత్తు కోసం ధరించాలని సీఐ దొరరాజు అన్నారు. రూ 800 ఖర్చు చేసి కొనుగోలు చేసిన హెల్మెట్ ఒక కుటుంబానికి అండగా నిలిచి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. అనంతరం హెల్మెట్ ధరిద్దాం - ప్రాణాలు కాపాడుకుందాం అంటూ వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వైకుంఠరావు, ముని, లక్ష్మణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# లంకూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం ప్రజల్లో ఆందోళన



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం లంకూరు గ్రామంలో ఎనిమిది నెలలుగా డ్రైనేజీల పూడిక జరగకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం నేపథ్యంలో వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపరచాలని వారు అధికారులను కోరుతున్నారు.

# పలువురిని పరామర్శించిన జక్కంపూడి రాజా



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని పలు కుటుంబాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కం పూడి రాజా పరామర్శించారు. చినకొండేపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన భూపతి రాజు రామరాజు దేవపు నాగమణి, ఏపుగంటి మణి కాంతం కుటుంబాలను రాజా పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్న చేకూరి సూర్య కాంతం, వడ్లమూడి లీల, ముసలి రత్నాజీ లను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అచ్చియ్యపాలెం గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేరబోయిన సూర్య చంద్రం, సామన సుబ్బారావుల స్వగృహాలకు వెళ్లి రాజా పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిల గురించి అడిగి తెలుసుకున్నారు.

# ముని కూడలిలో డ్రైనేజీలను పరిశీలించిన అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముని కూడలి గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.గోపీచంద్ ఆధ్వర్యంలో అధికారుల బృందం డ్రైనేజీలను పరిశీలించింది. గ్రామంలో సర్వే నిర్వహించి ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్స్, మ్యాజిక్ డ్రైన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఆర్ డబ్ల్యు ఎస్, ఉపాధి హామీ శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన అంచనాలు సిద్ధం చేయాలని గోపీచంద్ ఆదేశించారు. రాబోయే పుష్కరాల నాటికి పనులన్నీ పూర్తి చేయాలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమములో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ డి.శ్రీనివాస్, డిఈ వి.వి. గిరి, జే.క్యు.సి.ఓ.నరేష్, ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీఓ బి.వి.సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సీతానగరం డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాల కొరకు ఆహ్వానం




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరములు చేరాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డా శ్రీ రామమూర్తి ఒక ప్రకటనలో కోరారు న్యాక్ బి ప్లస్ గ్రేట్ సాధించిన ఈ కళాశాలలో పీహెచ్డీ పొందిన అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని ఆయన తెలిపారు కళాశాలలో అధునాతన కంప్యూటర్ సైన్స్ ల్యాబ్లు డిజిటల్ క్లాస్ రూమ్ లో వేలాది పుస్తకాలు గ్రంథాలయం క్రీడా మైదానం వంటి వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ ఉద్యోగ సాధనే లక్ష్యంగా ఇక్కడ బోధన సాగుతుందని పేర్కొన్నారు . బి. ఎ నందు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బీకాం నందు జనరల్ కంప్యూటర్స్, మ్యాథ్స్ ,జువాలజీ, కెమిస్ట్రీ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

**నేడు కూటమి ప్రభుత్వం**

# రెండేళ్ల విజయోత్సవ సభను జయప్రదం చేయండి

**ఎన్డీఏ కూటమి నాయకులు పిలుపు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా "రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం" పేరుతో నిర్వహిస్తున్న భారీ బహిరంగసభను నియోజకవర్గ ప్రజలందరూ విజయవంతం చేయాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బిజెపి నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి పిలుపునిచ్చారు. నేడు శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు బూరుగుపూడి ద్వారకామాయి ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజలు రాక్షస పాలనకు చరమగీతం పాడి, కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతగా రెండేళ్ల ప్రభుత్వం సాధించిన ప్రగతి ప్రజలకు తెలియజేయడానికి "రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి సంక్షేమం" విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి ఈ సభను జయప్రదం చేయాలన్నారు.

**కార్పొరేట్ పాఠశాలలకు పోటీనిస్తున్న**

# కార్పొరేషన్ పాఠశాలలు : వర్రే శ్రీనివాసరావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత విద్యా సంవత్సరం పది ఫలితాల్లో ప్రభుత్వ, కార్పొరేషన్ పాఠశాలు కార్పొరేట్ పాఠశాలలకు గట్టి పోటీనిచ్చాయని జీవకారుణ్య సంఘం చైర్మన్, మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గాంధీపురం -2, సుంకర భాస్కర రావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సంవత్సరం పదవతరగతి ఫలితాల్లో ఈ పాఠశాల నుండి ఇద్దరు జిల్లాస్థాయి ర్యాంకును సాధించారని, ఈ సంవత్సరం కూడా అధిక సంఖ్యలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతినెల నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులతో సమీక్షించాలన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ మాట్లాడుతూ సుంకర భాస్కరరావు ఉన్నత పాఠశాల సమగ్ర అభివృద్ధికి వర్రే శ్రీనివాసరావు చేస్తున్న కృషి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.లూక్‌రాజు, ఉపాధ్యాయులు ఉదయ బ్రహ్మం, శంకర్ పద్మావతి సంధ్యారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# రెండేళ్ల క్రితం ప్రియుడితో వివాహం..

## శుభవార్త చెప్పిన టాలీవుడ్ హీరోయిన్.. బేబీ బంప్ ఫొటోస్ వైరల్



2015లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ అందాల తార తెలుగు, తమిళంతో పాటు గుజరాతీ సినిమాల్లోనూ నటించింది. రవితేజ, విజయ్ దేవరకొండ లాంటి స్టార్ హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకుంది. ఇప్పుడీ అందాల తార తన జీవితంలో తన సరికొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. పలు తెలుగు సినిమాల్లో నటించిన పూజా ఝావేరి గుడ్ న్యూస్ చెప్పింది. రెండేళ్ల క్రితం ప్రియుడిత కలిసి పెళ్లి పీటలెక్కిన ఈ ముద్దుగుమ్మ త్వరలోనే తల్లిగా ప్రమోషన్ పొందనుంది. ప్రస్తుతం ఆమె నిండు గర్భంతో ఉంది. ఈ శుభవార్తను స్వయంగా పూజనే సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. తన భర్తతో కలిసి బీచ్ ఒడ్డున బేబీ బంప్‌తో తీసుకున్న ఫొటలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఇవి నెట్టింట బాగా వైరలవుతున్నాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఈ ముద్దుగుమ్మకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా గుజరాత్ లోనే పుట్టి పెరిగింది పూజా ఝావేరి. అక్కడే చదువుకుంది కూడా. అయితే సినిమాలపై ఆసక్తితో సొంతూరిని వదిలేసి ముంబైకు వచ్చేసింది. ఇక 2015లో 'భమ్ భోలేనాథ్' అనే తెలుగు సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైందీ అందాల తార. ఆ తర్వాత రౌడీబాయ్ విజయ్ దేవరకొండతో కలిసి 'ద్వారక', సుమంత్ అశ్విన్ 'రైట్ రైట్', రవితేజ 'టచ్ చేసి చూడు',47 డేస్, బంగారు బుల్లోడు, మాయగాడు, మిక్స్ అప్ తదితర తెలుగు సినిమాల్లో యాక్ట్ చేసింది. అందం, అభినయం పరంగా ఒకే అనిపించుకున్న ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోయిన్ రేంజ్ కు మాత్రం ఎదగలేకపోయింది. ఈ బ్యూటీ తెలుగు సినిమాల్లో కనిపించి దాదాపు రెండేళ్లు అవుతోంది. చివరిగా గతేడాది వందే భారత్ వయా యూఎస్ ఏ అనే ఓ గుజరాతీ సినిమాలో యాక్ట్ చేసింది పూజ. సినిమాల సంగతి పక్కన పెడితే.. 2024లో ఓ ఎన్నారైని పెళ్లి చేసుకుంది పూజా జవేరి. అప్పుడే తన భర్తతో కలిసి అమెరికాకు వెళ్లిపోయింది. ప్రస్తుతం న్యూయార్క్‌లోనే నివాస ముంటోందీ అందాల తార. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోందీ అందాల తార. తన భర్త, ఫ్యామిలీకి సంబంధించిన ఫొటోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తోంది. ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. నెటిజన్ల నుంచి లైక్స్ ,కామెంట్ల వర్షం కురుస్తుంటుంది.

### అంత అందమైన బ్యూటీని ఇలా మార్చేశారేంట్రా బాబు..!!

# ఈ అందాల తారను గుర్తుపట్టారా.?





చాలా మంది హీరోయిన్స్ నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. రీసెంట్ డేస్ లో పాన్ ఇండియా సినిమాలు ఇండస్ట్రీని షేక్ చేస్తున్న క్రమంలో హీరోయిన్ చాలా మంది ఛాలెంజింగ్ రోల్స్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. గ్లామర్ పాత్రలు మాత్రమే కాదు అవకాశం వస్తే ఎలాంటి పాత్ర అయినా చేస్తున్నారు. చాలా మంది హీరోయిన్స్ నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. రీసెంట్ డేస్ లో పాన్ ఇండియా సినిమాలు ఇండస్ట్రీని షేక్ చేస్తున్న క్రమంలో హీరోయిన్ చాలా మంది ఛాలెంజింగ్ రోల్స్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. గ్లామర్ పాత్రలు మాత్రమే కాదు అవకాశం వస్తే ఎలాంటి పాత్ర అయినా చేస్తున్నారు. ఇక పై ఫొటోలో ఉన్న హీరోయిన్ ను గుర్తుపట్టారా..? తన అందంతో ప్రేక్షకులను కవ్విస్తుంది ఆ బ్యూటీ..అలాగే నటనతోనూ ఈ అమ్మడు తోపే.. ఇంతకూ ఆమె ఎవరో కనిపెట్టారా.? ఆమె చాలా పాపులర్ అలాగే ఎంతో ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసింది ఈ ముద్దుగుమ్మ. ఆ అందాల భామ కేవలం నటి మాత్రమే కాదు నిర్మాత కూడా.. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది ఆమె. ఎవరో గుర్తుపట్టారా.? అందానికి కేరాఫ్ అడ్రస్ ఆమె.. ఆమె మరెవరో కాదు మలయాళ ముద్దుగుమ్మ మంజు వారియర్. ఈ చిన్నది తన 16వ ఏట 1995లో సాక్ష్యం అనే సినిమాతో తెరంగేట్రం చేసింది. మలయాళ ఇండస్ట్రీలో ఆమె ఎన్నో సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే ఎన్నో పురస్కారాలు కూడా అందుకుంది. ఏ పళయుం కదన్ను సినిమాలోని నటనకుగానూ మంజు కేరళ రాష్ట్ర ఉత్తమ సినీ నటి పురస్కారం లభించింది. ఆ తరువాత ఆమె వరసగా నాలుగు సార్లు ఫిలింఫేర్ ఉత్తమ నటి పురస్కారం గెలుచుకుంది మంజు. ఇక పైన కనిపిస్తున్న డీ గ్లామర్ ఫోటో ఆమె నటించిన అసురన్ సినిమాలోది. ధనుష్ హీరోగా నటించిన అసురన్ సినిమాలో ఆమె అద్భుతంగా నటించింది. ఈ సినిమాలో ధనుష్ భార్యగా కనిపించింది మంజు. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఇక ఆ మధ్య సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న వెట్టయన్ సినిమాలోనూ నటించి మెప్పించింది. అలాగే విజయ్ సేతుపతి హీరోగా నటించిన విడుదల 2లోనూ హీరోయిన్ గా చేసింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మంజు వారియర్ రెగ్యులర్ గా తన ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటుంది.

# అప్పుడే వచ్చేసిన ఐపీఎల్ 2027 షెడ్యూల్

## రెండు వారాలు ముందుకు జరపడానికి కారణం ఇదే..




ఐపీఎల్ 2027 షెడ్యూల్‌పై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది. టోర్నీ మార్చి 10 నుంచి మే 15 వరకు జరగనుంది. వర్షాలు, ఎండల ప్రభావం కారణంగా షెడ్యూల్ ముందుకు జరిపారు. అయితే మ్యాచ్‌ల సంఖ్య 74గానే కొనసాగుతుందని దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే ఐపీఎల్ 20వ సీజన్ నిర్వహణపై ఒక క్లారిటీ వచ్చేసింది. వచ్చే ఏడాది జరగబోయే ఐపీఎల్ 2027 టోర్నమెంట్‌ను ఎప్పటికంటే చాలా ముందే ప్రారంభించాలని బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా షెడ్యూల్ మారుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ, జూన్ 18 గురువారం నాడు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సరికొత్త డేట్స్‌ను అధికారికంగా ప్రకటించారు. వచ్చే సీజన్ మార్చి 10 నుంచే ప్రారంభం కాబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**మార్చి 10 నుంచి మే 15 వరకు సరికొత్త విండో**

న్యూస్ ఏజెన్సీ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఐపీఎల్ 2027 సీజన్ మార్చి 10న ప్రారంభమై మే 15 కల్లా ముగిసిపోతుందని వెల్లడించారు. అంటే ఈ మెగా లీగ్ మొత్తం 2 నెలల 7 రోజుల పాటు సాగనుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం ఐపీఎల్ మార్చి చివరి వారంలో మొదలై మే చివరి వారంలో లేదా జూన్ మొదటి వారంలో ముగుస్తుంది. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28 నుంచి ప్రారంభమై మే 31న ముగిసింది. అయితే వచ్చే ఏడాది మాత్రం ఈ పాత పద్ధతికి స్వస్తి పలికి, టోర్నీని రెండు వారాల ముందుకు జరుపుతున్నారు.

**షెడ్యూల్ మార్చడానికి బలమైన కారణం ఇదే**

ఐపీఎల్ విండోను మార్చడానికి గల వాతావరణ కారణాలను దేవజిత్ సైకియా సుదీర్ఘంగా వివరించారు. "ఈ ఏడాది ఐపీఎల్ మే చివరి వరకు సాగింది. అయితే మే 15 తర్వాత దేశంలోని పలు ప్రాంతాలలో ముందస్తు రుతుపవనాల వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది, ఇది మ్యాచ్‌ల నిర్వహణకు ఆటంకం కలిగిస్తుంది. దీనికి తోడు మే నెలలో ఎండల తీవ్రత విపరీతంగా పెరిగిపోతోంది. ఈ భయంకరమైన వేడి వల్ల మైదానంలో ఆడే ఆటగాళ్లతో పాటు, స్టేడియానికి వచ్చి మ్యాచ్‌లు చూసే ప్రేక్షకులకు కూడా తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అభిమానుల నుంచి మాకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. అందుకే క్రీడాకారుల ఆరోగ్యం, ఫ్యాన్స్ సౌకర్యం కోసం టోర్నీని మే 15 కల్లా ముగించేలా మా జనరల్ మేనేజర్ గేమ్స్ డెవలప్‌మెంట్‌కు ఆదేశాలు ఇచ్చాను" అని సైకియా పేర్కొన్నారు.

**మ్యాచ్‌ల సంఖ్య పెంపు ప్రతిపాదనను తోసిపుచ్చిన బోర్డు**

షెడ్యూల్ మార్పుతో పాటు, ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్యను పెంచుతారనే వార్తలను దేవజిత్ సైకియా పూర్తిగా కొట్టిపారేశారు. ప్రస్తుతం ఐపీఎల్‌లో ప్రతి జట్టు 14 గ్రూప్ మ్యాచ్‌లు ఆడుతుండగా, హోమ్ అండ్ అవే పద్ధతిలో దీన్ని 18 మ్యాచ్‌లకు పెంచాలని, తద్వారా మొత్తం మ్యాచ్‌ల కౌంట్‌ను 74 నుంచి 94కి మార్చాలనే ప్రతిపాదన బోర్డు ముందుకు వచ్చింది. దీనిపై సైకియా స్పందిస్తూ.. "ఇప్పటికిప్పుడు మ్యాచ్‌ల సంఖ్యను పెంచే ఆలోచన లేదు. చాలా మంది దీనిపై అడుగుతున్నారు కానీ 94 మ్యాచ్‌ల నిర్వహణ ప్రస్తుతానికి జరగని పని. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేం కానీ, ఇప్పుడైతే 74 మ్యాచ్‌ల విధానమే కొనసాగుతుంది" అని తేల్చి చెప్పారు.

**విదేశీ బోర్డుల బిజీ క్యాలెండర్ కూడా ఒక కారణమే**

మ్యాచ్‌ల సంఖ్యను పెంచకపోవడం వెనుక అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్స్ కూడా ప్రధాన పాత్ర పోషించాయని బీసీసీఐ సెక్రటరీ తెలిపారు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా వంటి ప్రముఖ క్రికెట్ బోర్డుల ఆటగాళ్లు ఐపీఎల్ లో ఆడుతుంటారు. ఆయా దేశాలకు కూడా వారి వారి ద్వైపాక్షిక సిరీస్‌లు ఉంటాయి. ఒకవేళ ఐపీఎల్ మ్యాచ్‌లను పెంచితే టోర్నమెంట్ కాలపరిమితి పెరిగి, విదేశీ ఆటగాళ్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటం కష్టమవుతుంది. అన్ని దేశాల ప్రయోజనాలను, ప్లేయర్ల బిజీ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకునే మ్యాచ్‌ల సంఖ్యను 74 వద్దే స్థిరంగా ఉంచినట్లు ఆయన స్పష్టం చేశారు.

# సచిన్ 'క్రికెట్ దేవుడు' అయితే.. వైభవ్ 'దేవుడి కొడుకు'..

## మాజీ క్రికెటర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్




వైభవ్ సూర్యవంశీని సచిన్ టెండూల్కర్‌తో పోల్చొద్దని మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ సూచించారు. సచిన్ క్రికెట్ దేవుడు అయితే వైభవ్ దేవుడి కొడుకు లాంటివాడని ప్రశంసించారు. యువ బ్యాటర్ ప్రతిభ, భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం ఎక్కడ చూసినా 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ గురించే చర్చ నడుస్తోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడి తన అద్భుతమైన హిట్టింగ్ నైపుణ్యాలతో అందరినీ ఆశ్చర్యపరిచిన ఈ కుర్రాడిని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఏకంగా టీమిండియా సీనియర్ టీ20 జట్టుకు ఎంపిక చేసింది. ఇంత చిన్న వయసులోనే భారత జట్టులోకి ఎంట్రీ ఇవ్వబోతుండటంతో, క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 37 ఏళ్ల నాటి రికార్డు ప్రమాదంలో పడింది. సచిన్ కంటే తక్కువ వయసులోనే వైభవ్ అంతర్జాతీయ మ్యాచ్ ఆడితే, అతడు చరిత్ర సృష్టించడం ఖాయం. ఈ క్రమంలోనే చాలా మంది అతడిని సచిన్ టెండూల్కర్‌తో పోల్చడం మొదలుపెట్టారు.

**శ్రీకాంత్ ఇచ్చిన క్రేజీ సన్ ఆఫ్ గాడ్ టైటిల్**

ఈ సచిన్ వర్సెస్ వైభవ్ వివాదంపై భారత మాజీ కెప్టెన్, మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఆసక్తికరంగా స్పందించారు. వేర్వేరు కాలాలకు చెందిన ఆటగాళ్లను పోల్చడం కరెక్ట్ కాదని చెప్తూనే, వైభవ్‌ను ఆకాశానికెత్తేశారు. "దయచేసి సచిన్‌తో వైభవ్‌ను పోల్చకండి. సచిన్ క్రికెట్ ప్రపంచానికి దేవుడు. ఆ దేవుడితో ఎవరూ సాటి రారు. కానీ ఈ 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు ఆ దేవుడి కొడుకులాగా అనిపిస్తున్నాడు. సచిన్ రేంజ్ వేరు, అతడి దగ్గరకు కూడా ఎవరూ వెళ్లలేరు. కాబట్టి ఈ పోలికలకు ఇక్కడితో ఫుల్ స్టాప్ పెట్టేయండి" అని శ్రీకాంత్ న్యూస్ ఏజెన్సీ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**వైభవ్ బ్యాటింగ్‌లో ఉన్న ఆ అద్భుత మ్యాజిక్ ఏంటి?**

66 ఏళ్ల కృష్ణమాచారి శ్రీకాంత్ విశ్లేషణ ప్రకారం.. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ లో, అండర్-19 క్రికెట్ లో సాధించిన రికార్డులు అసాధారణమైనవి. మైదానంలో ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ షాట్లు ఆడే విధానం చూస్తే ముచ్చటేస్తుందని ఆయన అన్నారు. వైభవ్ రిస్ట్ స్పీడ్, బ్యాట్ స్పీడ్, బ్యాట్ స్వింగ్ చాలా అద్భుతంగా ఉంటాయని కొనియాడారు. ఎంతటి భయంకరమైన బౌలర్ వచ్చినా క్రీజులో ఎంతో ప్రశాంతమైన మైండ్ సెట్‌తో నిలబడటం ఈ వండర్ కిడ్ కి ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్ అని శ్రీకాంత్ వివరించారు.

**గుజరాత్ టైటాన్స్‌పై ఆడిన ఆ క్లాస్ ఇన్నింగ్స్**

ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్‌పై వైభవ్ ఆడిన ఇన్నింగ్స్‌ను శ్రీకాంత్ ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఆ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ జట్టు విపరీతమైన ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ఈ 15 ఏళ్ల కుర్రాడు క్రీజులో పాతుకుపోయి 96 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. సాధారణంగా ఇన్నింగ్స్ మొదటి బంతి నుండే విరుచుకుపడే అలవాటు ఉన్న వైభవ్.. ఆ మ్యాచ్ లో మాత్రం జట్టు అవసరాల కోసం ఎంతో ఓపికగా ఆడి, సమయం చూసి క్లాస్ షాట్లతో రెచ్చిపోయాడు. రన్స్ చేయాలనే ఆకలి, బౌలర్లపై ఆధిపత్యం చలాయించాలనే కసి ఈ పిల్లాడిలో స్పష్టంగా కనిపిస్తోందని శ్రీకాంత్ ప్రశంసించారు.

**పిల్లాడిని సహజంగా ఎదగనివ్వండి**

వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్‌లో చాలా ప్రకాశవంతమైన భవిష్యత్తు ఉందని శ్రీకాంత్ జోస్యం చెప్పారు. అందుకే అతడిపై అనవసరమైన అంచనాలు మోపి, వేరే ఆటగాళ్లతో పోల్చి ఒత్తిడి పెంచవద్దని క్రికెట్ ఫ్యాన్స్‌కు, మీడియాకు సూచించారు. "వైభవ్‌ను ఎవరితోనూ పోల్చకండి. అతడిని తన లాగే ఉండనివ్వండి. ఎలాంటి ఒత్తిడి లేకుండా సహజంగా ఎదిగేలా, తనకు నచ్చినట్లు స్వేచ్ఛగా ఆడేలా మనం కేవలం ప్రోత్సహిస్తే చాలు. ఈ పిల్లాడు దేశానికి ఎన్నో గొప్ప విజయాలు అందిస్తాడు" అని శ్రీకాంత్ తన విశ్లేషణను ముగించారు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com